



epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 37 | 16-04-2026 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00


# మహిళా బిల్లుకు ఓకే డీలిమిటేషన్ బిల్లుకు నో

**వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే**

3 లో..



**పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది.**

ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది.





## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

**శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం**

**ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు.

2



## దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ సెగలు

**నిప్పుతో చెలగాట మాడుతున్న కేంద్రం**

**తమిళనాడు సిఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు**

**నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శనకు పిలుపు**

దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ పక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరు గుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు.

2



## నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

2

## డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

**దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటిఆర్ హెచ్చరిక**

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ పక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు.

2



## రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

**యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే**

**డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం**

**మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు**

**రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం**



2



2

## జనాభా ప్రకారం ఆలోచిస్తే నష్టమే

జనాభా ప్రకారమైతే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే అన్ని రాష్ట్రాల్లో 50 శాతం పెంపు విధానం తెచ్చారని తెలంగాణ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై ఆయన మీడియాతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వమే చట్టాలు చేసిందన్నారు.

## మహిళా రిజర్వేషన్లతో పాటు బిసి బిల్లు పెట్టాలి

**ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకోం**

**రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు గర్హనీయం**

**కాంగ్రెస్ ఎంపి మల్లు రవి మండిపాటు**



మహిళా రిజర్వేషన్‌తో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్ పెట్టాలని ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎంపీ హెచ్చరించారు. పార్లమెంట్‌లో తమ గళం వినిపిస్తామన్నారు. ఇలానే జరిగితే తెలంగాణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదం పొందాలంటే టూ థర్డ్ మెజారిటీ కావాలని ఎంపీ మల్లు రవి వెల్లడించారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎంపీ తీవ్రంగా ఖండించారు. సీఎంను నోరుమూసుకుని కూర్చోమంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

2

2



## పునర్విభజన జనాభా ప్రకారమే

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు.

## కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

**శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం**

**ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు**

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్–టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## దేశవ్యాప్తంగా డీలిమిటిటేషన్ సెగలు

**నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం**

**తమిళనాడు సిఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు**

**నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శనకు పిలుపు**

చెన్నై, అక్షరకలం ప్రతినిధి

దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ పక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు. 'కేంద్ర ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా?' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లబ్ది చేకూర్చి, దక్షిణాది ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా నేడు తమిళనాడు వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇంటింటిపై నల్లజెండాలు ఎగురవేయాలని రాష్ట్ర ప్రజలను స్టాలిన్ కోరారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ ఆయన ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరుగుతాయన్నది సీఎం స్టాలిన్ అభియోగం. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల గొంతు నొక్కడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, ఇప్పుడు రాజకీయంగా కూడా మొండిచేయి ఎదురవుతుందని ఆయన వాదిస్తున్నారు. దక్షిణాది ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే భారీ మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. మరోవైపు, రేపు పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న తరుణంలో విపక్షాలు ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్నాయి. రాజ్యాంగ విలువలు, సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ గళం ఎత్తేందుకు సిద్ధమయ్యాయి. ఈ పోరు కేవలం సీట్ల కోసం మాత్రమే కాదు, దక్షిణాది రాష్ట్రాల ఉనికి, గౌరవం కోసమని విపక్ష పార్టీలు చెబుతున్నాయి.

## డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

**దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటిఆర్ హెచ్చరిక**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ పక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. 'ఢిల్లీ పాలకులు మా మాట వినాలని, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నాం' అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

## జనాభా ప్రకారం ఆలోచిస్తే నష్టమే

**అందుకే రాష్ట్రాల్లో 50 శాతం పెంపు**

**బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జనాభా ప్రకారమైతే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే అన్ని రాష్ట్రాల్లో 50 శాతం పెంపు విధానం తెచ్చారని తెలంగాణ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై ఆయన మీడియాతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వమే చట్టాలు చేసిందన్నారు. 1972 లో కాంగ్రెస్ చేసిన డీలిమిటేషన్ వల్ల ఏపీకి ఒక లోక్‌సభ సీటు తగ్గింది. ప్రస్తుత సీట్ల ప్రకారమైతే మహిళలకు 170 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. సీట్లు పెంచి మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే 270కిపైగా సీట్లు వస్తాయి. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా హైబ్రిడ్ పాలసీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారని విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని తెలిపారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ విమర్శలు చేస్తున్నారని అన్నారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది ఎక్కడ ఉందో చెప్పాలని అన్నారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని తెలియదా అని అన్నారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాల తీరుపై మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారని ఇది సరికాదని అన్నారు.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

**మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ**

**ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం**

**వాడీవేడీగా సాగనున్న సమావేశాలు**

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు–2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82,



170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం–2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం–2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించుకోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజనను చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

## రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

**యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే**

**డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం**

**మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు**

**రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం**

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని ఆ పార్టీ నేతలను ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదన చేస్తున్నారని వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు.

## పునర్విభజన జనాభా ప్రకారమే

**రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే**

**సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు**

**బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

వరంగల్, అక్షరకలం ప్రతినిధి

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన పక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ పక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన పక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## మహిళా రిజర్వేషన్లతో పాటు బిసి బిల్లు పెట్టాలి

**ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకోం**

**రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు గర్హనీయం**

**కాంగ్రెస్ ఎంపి మల్లు రవి మండిపాటు**

న్యూఢిల్లీ,

మహిళా రిజర్వేషన్‌తో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్ పెట్టాలని ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎంపీ హెచ్చరించారు. పార్లమెంట్‌లో తమ గళం వినిపిస్తామన్నారు. ఇలానే జరిగితే తెలంగాణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదం పొందాలంటే టూ థర్డ్ మెజారిటీ కావాలని ఎంపీ మల్లు రవి వెల్లడించారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎంపీ తీవ్రంగా ఖండించారు. సీఎంను నోరుమూసుకుని కూర్చోమంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అహంకారపూరిత మాటలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం అంటే కిషన్ రెడ్డికి విలువ లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. భారతదేశం ఐక్యంగా ఉండాలని ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు ప్రాణత్యాగం చేశారని ఎంపీ గుర్తుచేశారు. భారతదేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు పైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రం హడావుడి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన ను రెండింటిని ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేస్తున్నారు. ఈ రెండు అంశాలు ఒకదానికి ఒకటి సంబంధం లేనివని ఎంపి మల్లు తెలిపారు. రెండింటిని విడదీసి వేరు వేరుగా చర్చించి అమలు పైన విధివిధానాలపైన పారల్మటెంట్ నిర్ణయం తీసుకోవాలన్నారు. రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. అన్నారు.రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు. బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని, మరి ఇంత కాలం మోడీ ఈ బిల్లును పట్టించుకోలేదన్నారు. 2026 తర్వాత జనాభా లెక్కల తర్వాత గెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 543 లోక్ సభ సభ్యుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే 181 మహిళలు ఎన్నిక అయ్యేందుకు అవకాశం ఉండేదని అన్నారు.

----------

# మహిళా బిల్లుకు ఓకే డీలిమిటేషన్ బిల్లుకు నో

## వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు



రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్ ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# చండూరు మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తి



## --నలుగురు సభ్యుల ఏకగ్రీవ ఎంపిక

**అక్షరకలం, చండూరు**

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం రోజున కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడింది. ఈ ఎన్నికలో మున్సిపల్ శాఖపై ప్రత్యేక అవగాహన, అనుభవం కలిగిన విభాగంలో మొగుదాల సత్తమ్మ, కల్లెట్ల చంద్రకళలు ఎన్నికవగా, మైనారిటీ వర్గాల ప్రతినిధులుగా షేక్ ఖలీల్, మహమ్మద్ సలీమాలు కో–ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , మున్సిపల్ కమీషనర్ మరియు కౌన్సిలర్లు బుషిపాక వాసు, జెల్ల ధనమ్మ, కోడి సుష్మవెంకన్న, కలిమికొండ పారిజాత, కటకం రమేష్‌లు నూతనంగా ఎన్నికైన సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధిలో నూతన సభ్యులు తమ వంతు సహకారాన్ని అందిస్తారని ఆశిస్తున్నట్లు ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు.

# జావేద్ మృతి పట్ల టి జే ఎఫ్ ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ తీవ్ర సంతాపం

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఖమ్మం నగర మాజీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ సూర్యాపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల టియుడబ్ల్యూ జె (టి జె ఎఫ్) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదంలో మహ్మద్ జావేద్ మృతి ఘటన కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని, ప్రజా సేవలో ఆయన చూపిన నిబద్ధత, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ కొనియాడారు. ఈ సందర్భంగా జావేద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని,జావేద్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు.

# నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2

## దరఖాస్తు నుంచి అనుమతుల వరకు ఆన్‌లైన్ కేంద్ర కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ బృందంతో సిఎం సమీక్ష

**అమరావతి,**

మే నెలాఖరులోగా డీ–రెగ్యులేషన్ ఫేజ్–2 అమల్లోకి వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు అన్నారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకు వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రతిపాదిత డీ–రెగ్యులేషన్ ఫేజ్–2 విధానాలపై చర్చించారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం, అనుమతుల సులభతరంపై మాట్లాడారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్.. ముఖ్యమంత్రి ఎదుట ఉంచారు. ఈ ప్రతిపాదనలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనల్లో రాష్ట్రం చాలా ముందుందని సందీప్ పౌండ్రిక్ చెప్పగా.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానం అవలంబిస్తున్నట్లు వెల్లడించారు. డీ–రెగ్యులేషన్ ఫేజ్–3 చేపడుతున్నారా? అని సందీప్ పౌండ్రిక్‌ను సీఎం అడిగారు. జూన్ నెల నుంచి ఫేజ్–3పై పని చేస్తామని ఆయన తెలిపారు. ఫేజ్–3లో టెక్నాలజీ




అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్దపీట వేయాలని సీఎం కోరారు.ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు తీసుకురావాలని చంద్రబాబు సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణం విషయంలో రాజీపడొద్దన్నారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అటవీ చట్టాలను సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. ఫైర్ సేఫ్టీపై నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనల విషయంలో పలు సూచనలు చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలన్నారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవితకాలం చెల్లుబాటు అయ్యేలా నిబంధనలు సవరించాలన్నారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని దిశానిర్దేశం చేశారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించారు. మే నెలాఖరులోగా డీరెగ్యులేషన్ ఫేజ్–2 అమల్లోకి వచ్చేలా చూడాలని.. ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని దిశానిర్దేశర చేశారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం పక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫేజ్–2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతుల ఏర్పాటుకు ఇప్పుడున్న పక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని సూచించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే ఏపీ చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ తెలిపారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

# యూపిలో కార్మికుల కనీస వేతనంపై 3వేలు పెంపు

## కార్మికుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

**లక్నో,**

ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కార్మికుల కనీస వేతనాలను రూ.3వేలు వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కనీస వేతనం పెంచాలంటూ నోయిడా , ఘజియాబాద్‌లోని కార్మికులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. నోయిడా, ఘజియాబాద్‌లలోని నైపుణ్యం లేని కార్మికుల నెలవారీ వేతనాలు రూ.11,313 నుంచి రూ.13,690కి పెంచింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. ఇతర రంగాల కార్మికులకు కూడా వేతనాలు పెంచుతున్నట్లు పేర్కొంది. అయితే, మున్సిపల్ కార్పొరేషన్లు, జిల్లాల్లో ఈ వేతన పెంపు వేరువేరుగా ఉంటుందని స్పష్టంచేసింది. ఇది తాత్కాలిక నిర్ణయం మాత్రమేనని.. వేతన మండలి సమగ్ర సమీక్ష తర్వాత దీనిపై పూర్తి నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. నోయిడాలో మంగళవారం కూడా ఆందోళనలు చెలరేగాయి. తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న కార్మికులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కొందరు రాళ్ల దాడికి పాల్పడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. వేతనాలు పెంచాలంటూ సోమవారం నోయిడాలో వేల మంది కార్మికులు ఆందోళన చేపట్టారు. కొంతసేపటికే అవి హింసాత్మకంగా మారాయి. పోలీసుల పైకి రాళ్లు రువ్వడంతో సహా కార్లు తగలబెట్టడం, రహదారులను దిగ్బంధించడం వంటివి చోటుచేసుకున్నాయి. పరిశ్రమలోని సీసీటీవీ దృశ్యాల ఆధారంగా హింసాత్మక ఘటలనకు పాల్పడిన 300 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. మరో 100 మందిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా.. ఇక్కడ ఇటీవల పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో కొందరు వ్యక్తుల అరెస్టులు జరిగాయి. ఈ క్రమంలో తాజా ఘర్షణల్లో పాక్ ప్రమేయం ఉందేమోనన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని ఉత్తరప్రదేశ్ కార్మికశాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ పేర్కొన్నారు.

# నోయిడా అల్లర్ల వెనక పాక్ హస్తం

## అల్లర్లకు పాల్పడ్డ 300 మంది కార్మికుల అరెస్టు

## యూపి కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ వెల్లడి

**లక్నో,**

నోయిడాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడిన 300 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. మరో 100 మందిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. వేతనాల పెంపు, 8 గంటల పని కోసం సోమవారం కార్మికులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. నోయిడాలోని ఫేజ్–2, సెక్టార్ 60, సెక్టార్ 62, సెక్టార్ 84 సహా పలు ప్రాంతాల్లో కార్మికులు ఆందోళనకు దిగారు. పలు వాహనాలను తగులపెట్టి.. భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వారు. జాతీయ రహదారి –9 సహా పలు రోడ్లను దిగ్బంధించారు. దీంతో నోయిడా– ఢిల్లీ సరిహద్దుల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువులు సైతం ప్రయోగించారు. అయితే, కార్మికుల హింసాత్మక ఘటనలపై ఉత్తర ప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ స్పందించారు. దాడిని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హింసగా అభివర్ణించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై ఇటీవల నోయిడా, మీరట్‌లలో నలుగురు అనుమానితులు అరెస్టయిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. నిన్నటి దాడికి పాకిస్థాన్‌తో సంబంధం ఉందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆ కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. అస్థిరతను సృష్టించే ఉద్దేశంతోనే ఈ ఘటన జరిగి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి రాజ్‌భర్ చెప్పారు. రాష్ట్రంలో అస్థిరతను సృష్టించేందుకు దేశ వ్యతిరేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. ముజఫర్‌నగర్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కార్యక్రమానికి అంతరాయం కలిగించే కుట్రలో భాగంగానే ఈ అల్లర్లు జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కార్మికులు ప్రశాంతంగా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు, తప్పుడు సమాచారానికి ప్రభావితం కాకూడదని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు వినేందుకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు నోయిడాకు చేరుకుని కార్మికులతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి రాజ్ భర్ తెలిపారు.

# రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఎపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు.

# క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా అమరావతి

## తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ సెంటర్‌కు శ్రీకారం

## భవిష్యత్‌లో కీలక శక్తిగా మారనుందన్న చంద్రబాబు

**అమరావతి,**

రేపటి ప్రపంచాన్ని శాసించే టెక్నాలజీకి కేంద్రంగా అమరావతి సాంకేతిక రంగం సంబంధించి మరో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశంలో మొట్టమొదటి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్‌ను సిఎం చంద్రబాబు ఆవిష్కరించారు. మంగళవారం అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీ, గన్నవరం మేధాటవర్స్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను ఎస్ఆర్ఎం వర్సిటీ నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించారు. 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను సీఎం జాతికి అంకితం చేశారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. దీనికి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహకారం అందించింది. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సభ్యులు సహా ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగ శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరయ్యారు. ఎపిలోని వివిధ వర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్‌గా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. టెక్నాలజీని అర్థం చేసుకుని ప్రోత్సహించే నాయకత్వం దేశానికి అవసరమని, ఆ దిశగా ప్రధాని నరేంద్ర మోడీ సమర్థవంతంగా ముందుకు తీసుకెళు న్నారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉండటం దేశానికి అదృష్టమని వ్యాఖ్యానించారు. అమరావతి క్వాంటం వ్యాలీ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కేవలం ఎనిమిది నెలల్లోనే ఈ క్వాంటం ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ..క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తిగా మారనుందని అన్నారు. పారిశ్రామిక రంగానికి విద్యుత్ ఎంత ముఖ్యమో, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ ఎంత అవసరమో, ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ కూడా అంతే కీలకమని వివరించారు. ఈ రంగంలో ముందంజలో ఉన్న దేశాలే భవిష్యత్తును శాసించే అవకాశముందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా స్వదేశీ తయారీ క్వాంటం కంప్యూటర్ దేశానికి గర్వకారణమని, అమరావతి క్వాంటం వ్యాలీ రాష్ట్రానికే కాకుండా దేశానికీ ప్రతిష్ఠను తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు క్వాంటం టెస్ట్ బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టి÷ చేయడానికి కీలక వేదికలుగా నిలవనున్నాయి. పరిశోధకులు, విద్యార్థులు, కంపెనీలు క్వాంటం టెక్నాలజీని వినియోగించుకునేలా వీటి ద్వారా అవకాశాలు విస్తరించనున్నాయి. క్వాంటం సైన్స్‌కు వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం గర్వకారణమని సీఎం అన్నారు.

# రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేలా వైకాపా ఉన్మాదం

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలం ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందని మంత్రి పార్థసారథి అన్నారు. అధికార మదంతో విర్రవీగిన వైసీపీ నేతలు, సామాన్యుల నుంచి ప్రతిపక్ష నేతల వరకు ఎవరినీ వదలకుండా వేధింపులకు గురిచేశారని రాజకీయ విశ్లేషకులు మండిపడుతున్నారని గుర్తు చేశారు. వైసీపీ సాగించిన ఈ 'ఉన్మాద రాజకీయాలు' చివరకు ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి పార్థసారధి గత ప్రభుత్వంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో చట్టాన్ని గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అరాచకాలు సృష్టించారు. ప్రతిపక్షాలపై భౌతిక దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం ద్వారా వారి గొంతు నొక్కారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడంతో రాష్ట్రంలో అశాంతి రాజ్యమేలింది. ప్రజల ఆస్తులను కబ్జా చేయడం, ప్రకృతి వనరులను దోచుకోవడమే పనిగా పెట్టుకున్న వైసీపీ నేతలు, రాష్ట్రాన్ని అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని అన్నారు. జగన్ ఏం చెబితే అది చేస్తాం.. ఆత్మాహుతి దళంగా పనిచేస్తామంటున్నవారు నాయకులా..? లేక ఉగ్రవాదులా? అని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర వినాశనం కోరుకుంటున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్రనాయకత్వం ఆలోచనలో తప్పు ఉంటే చర్చించాల్సింది పోయి.. గుడ్డిగా అనుసరిస్తారా? అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే వైకాపా పనిగా పెట్టుకుంది. రాష్ట్రంలో వైకాపా ఉన్మాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారింది. వైకాపా హయాంలో అరాచక పాలన సాగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# యుద్ధోన్మాద మత్తు దిగితేనే.... ప్రపంచ శాంతి !

నోబెల్ శాంతి బహుమతి కావాలని కోరుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్..యుద్ధోన్మాదిగా మారాడు. ఆయనకు తోడుగా ఇజ్రాయల్ ప్రధాని బెంజ్‌మెన్ న ఎతన్యాహు తోడయ్యారు. వీరిద్దరు కలసి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న తీరుతో ప్రపంచ దేశాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఓ రకంగా చెప్పాలంటే అమెరికా ఎంతగా నష్టపోయినా సరే ట్రంప్ మాత్రం యుద్ధాన్ని వీడేది లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. చర్చలు విఫలం అయితే దానికి ఎక్కువ బాధ్యత అమెరికాదే. ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టిందే వారు. ఇప్పుడు దానికి అణుబూచి రంగు పులిమి ఇరాన్‌ను దెబ్బతీయాలని చూడడం సరికాదు. నిజానికి ప్రపంచదేశాలు ట్రంప్ తీరుపై గళమెత్తాలి. కానీ ఏ దేశం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. భారత్ కూడా మాటకూడా మాట్లాడడం లేదు. ఎందుకంటే ఇప్పుడు యుద్ధం ముగించకుంటే చమురు మంటలు అన్ని దేశాలను దహించి వేస్తాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడుతారు. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. పాకిస్థాన్ వేదికగా జరిగిన ఈ చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లే కన్పించినా.. చివరి నిమిషంలో వీటికి బ్రేక్ పడింది. ఇందుకు కారణం అణు కార్యకలాపాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడమేనని తాజాగా తెలిసింది. 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధి నిలిపివేయాలని అమెరికా ప్రతిపాదన పెట్టగా, అందుకు ఇరాన్ నిరాకరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. యురేనియం శుద్ధిని ఐదేళ్ల పాటు మాత్రమే నిలిపివేస్తామని టెహ్రాన్ చెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకు అగ్రరాజ్యం సమ్మతించకపోవడంతోనే చర్చలు ఆగిపోయినట్లు తెలిపాయి. వాస్తవానికి టెహ్రాన్ శాశ్వతంగా యురేనియం శుద్ధిని నిలిపివేయాలని ట్రంప్ యంత్రాంగం ముందునుంచీ డిమాండ్ చేసింది. కానీ చర్చల సమయంలో దాన్ని 20 ఏళ్లకు తగ్గించడం గమనార్హం. అయితే ఈ పీటముడి ఇలాగే ఉంటుందా...అమెరికా మళ్లీ యుద్ధానికి కాలుదువ్వుతుందా అన్న ఆందోళన ప్రపంచ దేశాలను కలచివేస్తోంది. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా–ఇరాన్ మధ్య ఈ స్థాయిలో అత్యున్నత స్థాయి సమావేశం జరగడం మళ్లీ ఇప్పుడే. ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ భేటీలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ సహా ఇరుదేశాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు 20 గంటల పాటు ఈ చర్చలు సాగాయి. 80శాతం అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఒప్పందం దాదాపు కుదిరినట్లుగానే కన్పించింది. కానీ, కాసేపటికే అవి విఫలమయ్యాయని పాక్ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ చర్చలు పూర్తిగా నిలిచిపోలేదని, రెండోదశ ముఖాముఖి భేటీకి ఇరుదేశాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. డీల్ కుదుర్చుకునేందుకు తాము సుముఖంగానే ఉన్నామని ఇరాన్ తమతో చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చలు సాఫీగా సాగేలా పట్టువిడుపులు ఉండాల్సిందే. దెబ్బతిన్న ఇరాన్ పునరుద్ధరణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఎందుకంటే చమురు సంక్షోభంముదరకుండా చూసుకోవాలి. ఇప్పటికే బ్యారెట్ ధర 113 డాలర్లకు చేరింది. ఇది ఆయా దేశాలపై మోయలేని భారం చూపనుంది. అందుకే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది దాంతో రానున్న వారాల్లో చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కూడా హెచ్చరించారు. ర్మూజ్‌లో నౌకల రాకపోకలు మొదలైనా.. రవాణా మునుపటి స్థాయికి చేరేవరకు ఈ మోత ఉంటుందని హెచ్చరించారు. ర్మూజ్ లో నౌకల రాకపోకలు గణనీయస్థాయిలో పెరిగే వరకు ఇంధన ధరల అధికంగా ఉండొచ్చు. పెరుగుతూనే ఉండొచ్చు .కూడా ము÷ఎద్ధం ముగిస్తే తప్ప చమురు ధరలు తగ్గొచ్చని అందరూ అంచనా వేస్తున్నారు. ఇక నవంబర్‌లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికల వరకు ఇంధన ధరలు ఎక్కువగానే ఉండొచ్చని ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సూచనప్రాయంగా వెల్లడించారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మార్చి నెలలో గల్ఫ్ దేశాల నుంచి చమురు ఉత్పత్తి భారీగా తగ్గిందని ఒపెక్ విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడవుతోంది. ఇరాక్‌లో దాదాపు 61శాతం మేర ఉత్పత్తి తగ్గింది. ఫిబ్రవరిలో రోజుకు 4.2 మిలియన్ బ్యారెళ్ల నుంచి మార్చిలో రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది. కువైట్‌లో 53శాతం, యూఏఈలో 44 శాతం, సౌదీ అరేబియా 23 శాతం ఉత్పత్తి తగ్గిపోయింది. ఇక చమురు



సరఫరాలో కీలకమైన పైప్‌లైన్ ఇరాన్ దాడుల్లో దెబ్బతినడంతో రోజూవారీ 7 మిలియన్ల బ్యారెళ్ల నుంచి 7 లక్షల బ్యారెళ్లకు పడిపోయిందని సౌదీ మీడియా వెల్లడించింది. మొత్తంగా ఒపెక్ దేశాలు చేసే ఉత్పత్తి 27 శాతం మేర కుంగింది. ఇదిలాఉంటే.. ర్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం అమెరికా నిర్ణయాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. జలసంధిలో తమ నౌకల కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. అందుకు తగ్గట్టే ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోకుండా.. అమెరికా ఆంక్షలున్న చైనా ట్యాంకర్ హర్మూజ్‌ను దాటింది. మరిప్పుడు దీనిపై యూఎస్ నౌకాదళం ఎలా స్పందిస్తుందో తెలియాల్సి ఉంది. మొత్తంగా ఈ దోబూచులాట ఆగాలి. చమురు దేశాలు స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకునే స్థితి రావాలి. అప్పుడే ప్రపంచంలో శాంతి వస్తుంది. ట్రంప్ కూడా మూర్ఖంగా ముందుకు వెళ్లకుండా ప్రపంచశాంతికి కట్టుబడి ఉండాలి.

# ప్రాణం విలువ తెలుసుకోండి..

### హెల్మెట్ ధరించి క్షేమంగా ఇంటికి చేరండి

### నకిరేకల్‌లో 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు

### రాష్ట్రంలో హత్యల కంటే రోడ్డు ప్రమాద మరణాలే ఎక్కువ

### ఏడాదికి 7,500 మంది బలి... డీజీపీ ఆవేదన

### నల్గొండలో అండర్ పాస్ మార్గాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు

### మంత్రి హామీ

### 2,000 మందికి ఉచితంగా హెల్మెట్ల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**













రోడ్డు ప్రమాదాలు జరగకుండా పెద్ద ఎత్తున ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 13 నుండి 18 వరకుఅరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా పోలీస్, రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా మోటార్ సైకిల్ పై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, అలాగే కార్లలో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని చెప్పారు. వాహనాలపై వెనుక ఉన్నవారు సైతం హెల్మెట్లు ధరించాలని అన్నారు.

పోలీసు అధికారులు రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి జాతీయ రహదారులు ,ఇతర రహదారులపై అతివేగంతో వెళ్లే వాహనాలను నియంత్రించేందుకు పెట్రోలింగ్ పెంచాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ రహదారి భద్రతపై దృష్టి సారించాలని, ఈ విషయంపై అందరికీ అవగాహన కల్పిస్తే రహదారి ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. నల్గొండ జిల్లాలో అండర్ పాస్ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని, అలాగే నకిరేకల్ లో స్థలం చూపిస్తే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనానికి నిధులు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యలతో పోలిస్తే రోడ్డు ప్రమాదాలలో చనిపోయేవారి సంఖ్య ఎక్కువగా ఉందని, రోడ్డు ప్రమాదాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రత్యేకించి రహదారి భద్రతపై అలైవ్ అరైవ్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతున్నదని, పోలీసు, ట్రాన్స్పోర్ట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సంవత్సరానికి 800 మంది హత్యలకు గురై చనిపోతుండగా ,రోడ్డు ప్రమాదాలలో 7500 మంది చనిపోతున్నారన్నారు. నల్గొండ జిల్లాలో హత్యల కారణంగా 24 మంది చనిపోతే రోడ్ యాక్సిడెంట్లలో 325 మంది చనిపోతున్నారని, సూర్యాపేట జిల్లాలో హత్యల కారణంగా 25 మంది, రోడ్డు ప్రమాదాలలో 230 మంది గత సంవత్సరం చనిపోయినట్లు ఆయన గణాంకాలు వివరించారు.అన్ని శాఖల సమన్వయంతో వీటిని తగ్గించాల్సిన అవసరం ఉందని, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతిని, అధికారులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వాహనాలు నడిపేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని, టు వీలర్ పై వెళ్లేవారు హెల్మెట్ ,ఫోర్ వీలర్ పై వెళ్లేవారు సీట్ బెల్ట్ ధరించాలని, వాహనం వెనక కూర్చున్న వారు సైతం తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని అన్నారు. రహదారుల పై చనిపోయిన వారిలో 65% కాలినడకన వెళ్లేవారు, మోటార్ సైకిల్ పై వెళ్లేవారే చనిపోతున్నారని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని , హెల్మెట్ ధరించాలని ఎవరు వాహనదారునికి చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ జాతీయ రహదారి నిడివి జిల్లాలో ఎక్కువగా ఉన్నందున రోడ్డు మీద వెళ్లేవారు తిరిగి క్షేమంగా ఇంటికి వస్తారో లేదో అన్న ఆందోళన ఉందని , రోడ్డు ప్రమాదాల నివారణకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అరైవ్,అ లైవ్ గొప్ప కార్యక్రమం అని అన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల జిల్లాలోని ప్రజలందరూ చైతన్యవంతం కావాలని, తమ నియోజకవర్గ పరిధిలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా రోడ్డు భద్రత కార్యక్రమాలు చేపట్టామని, హెల్మెట్ లేని వారు తప్పకుండా హెల్మెట్ కొనుక్కుని ధరించి వాహనాలు నడపాలని, జిల్లాలో రోడ్ సేఫ్టీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని, జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో జాతీయ రహదారి నిడివి ఎక్కువగా ఉందని, గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లా యంత్రాంగం, పోలీసులు తీసుకున్న చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గాయని 2024 సంవత్సరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల 390 మంది చనిపోతే, గత సంవత్సరం 347 మంది చనిపోయారని తెలిపారు. రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తాఅమిత్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు , తదితరులు మాట్లాడారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డిఐజి చౌహాన్, సర్వోత్తమ్ రెడ్డి, పున్న కైలాస్ నేత, మున్సిపల్ చైర్మన్ రజిత, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ నకరికల్ శాసనసభ్యులు వేముల వీరేశం 2000 మందికి హెల్మెట్లను ఇవ్వాలని నిర్ణయించగా ఇన్చార్జి మంత్రి, డిజిపి ల చేతుల మీదుగా వాటిని అందజేశారు.

కార్యక్రమానికి హాజరైన వారందరి చేత రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 40 మంది గ్రామ సర్పంచ్లు తమ గ్రామ పరిధిలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపమని తీర్మానిస్తూ తీసుకున్న నిర్ణయాలను రాతపూర్వకంగా మంత్రికి అందజేశారు. అరేయ్ అలైయు కార్యక్రమంలో భాగంగా సమావేశ ప్రాంగణంలో కంటి చికిత్స శిబిరాన్ని అరైవ్ అలైవు పై ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని మంత్రి సందర్శించారు.

# సిఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు

### అనుమానాలతో గందరగోళం సృషించవద్దు

### రేవంత్ ప్రధానికి లేఖ రాయడంపై పార్టీ నేతల విమర్శలు

**హైదరాబాద్,**

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటి అనుమానాలతు, వ్యాఖ్యలతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించవద్దని కిషన్ రెడ్డి అన్నారు.

# బంగ్లా పౌరుల పడవ మునక

### 250 మంది గల్లంతు..ముమ్మర గాలింపు

**ఢాకా,**

అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టెక్నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. మలేసియా వెళు ్తండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉద్ధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

# అమెరికా ఆర్థిక వ్యవస్థలో వసలదారుల కీలక భూమిక

### వారు ఈదేశ ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు

### తన అత్తామామలు కూడా ఆకోవలోని వారే


### ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు

**న్యూయార్క్,**

అమెరికా ఆర్థికవ్యవస్థలో వలసదారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ అన్నారు. అదే సమయంలో ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్స్‌పై కఠిన నియంత్రణ నూ సమర్థించారు. అమెరికా పౌరసత్వం పొందడం అంటే ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమేనని వాన్స్ స్పష్టంచేశారు. హెచ్–1బీ వ్యవస్థలో మోసాలు జరుగుతున్నాయని భావిస్తున్నట్లు చెప్పారు. నేను భారత్ నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. నాకు నా అత్తమామలంటే చాలా ఇష్టం. వారు గొప్ప వ్యక్తులు. యూఎస్‌కు వారు ఎంతో సేవ చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# విరాట్ పై బీసీసీఐ యాక్షన్ తీసుకుంటుందా?

ఐపీఎల్ 2026లో భాగంగా వాంఖడే స్టేడియంలో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఘనవిజయం సాధించింది. అయితే ఈ గెలుపు కంటే ఎక్కువగా విరాట్ కోహ్లీ ప్రవర్తన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్‌లో 50 పరుగులతో మెప్పించిన కోహ్లీ, ఔటైన తర్వాత తన కోపాన్ని ఆపుకోలేకపోయారు. పెవిలియన్‌కు వెళ్లే క్రమంలో అతను చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ఇది కేవలం కోపమేనా లేక ఐపీఎల్ నిబంధనల ఉల్లంఘనా అనే చర్చ మొదలైంది. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బీసీసీఐ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 38 బంతుల్లో 50 పరుగులు చేశారు. హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో సూర్యకుమార్ యాదవ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగారు. అయితే తన ఆట తీరు పట్ల అసంతృప్తిగా ఉన్న కోహ్లీ, బౌండరీ లైన్ దాటిన తర్వాత తన గ్లోవ్స్ హెల్మెట్‌ను కోపంతో నేలకేసి విసిరేశారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. సాధారణంగా అగ్రెసివ్‌గా ఉండే కోహ్లీ, ఇలా క్రీడా సామగ్రిని విసిరేయడం ఐపీఎల్ నిబంధనల ప్రకారం నేరంగా పరిగణించబడుతుంది. కోహ్లీ ప్రవర్తన ఇప్పుడు క్రమశిక్షణా చర్యలకు దారితీసేలా కనిపిస్తోంది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఆటగాళ్లు మైదానంలో సంయమనం పాటించాలి. కోహ్లీ గ్లోవ్స్ హెల్మెట్ విసిరేయడం ఆర్టికల్ 2.2 నిబంధనలను ఉల్లంఘించినట్లు అవుతుంది. ఒకవేళ మ్యాచ్ రిఫరీ దీనిని తీవ్రంగా పరిగణిస్తే విరాట్‌పై జరిమానా విధించే అవకాశం ఉంది. గతంలో కూడా పలువురు ఆటగాళ్లు ఇలాంటి పనులు చేసి జరిమానాలు ఎదుర్కొన్నారు. స్టార్ ప్లేయర్ అయినంత మాత్రాన నిబంధనల నుంచి మినహాయింపు ఉండదు కాబట్టి బీసీసీఐ దీనిపై విచారణ జరిపే అవకాశం ఉంది. ఐపీఎల్ నిబంధనావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం క్రికెట్ పరికరాలను, దుస్తులను లేదా మైదానంలోని వస్తువులను దుర్వినియోగం చేయడం నేరం. వికెట్లను తన్నడం, అడ్వర్టైజింగ్ బోర్డులను కొట్టడం, డ్రెస్సింగ్ రూమ్ తలుపులను బాదడం వంటి చర్యలు ఇందులోకే వస్తాయి. కోహ్లీ హెల్మెట్ విసిరేయడం కూడా 'అబ్యూస్ ఆఫ్ క్రికెట్ ఎక్విప్‌మెంట్' కిందికే వస్తుంది. ఇది లెవల్ 1 నేరంగా పరిగణించబడుతుంది. ఇలాంటి పనులు చేసినందుకు ఆటగాళ్లకు హెచ్చరికలతో పాటు జరిమానా కూడా విధిస్తారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం లెవల్ 1 నేరం రుజువైతే సదరు ఆటగాడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం నుంచి 25 శాతం వరకు జరిమానా పడే అవకాశం ఉంది. అంతేకాకుండా ఒక డెమెరిట్ పాయింట్‌ను కూడా కేటాయిస్తారు. కోహ్లీ వీడియో ఆధారంగా రిఫరీ చర్యలు తీసుకుంటే మ్యాచ్ ఫీజులో కోత పడటం ఖాయంగా కనిపిస్తోంది. సాధారణంగా ఇలాంటి విషయాల్లో మ్యాచ్ రిఫరీదే అంతిమ నిర్ణయం. కోహ్లీ ఉద్దేశపూర్వకంగా చేశారా లేక ఆవేశంలో జరిగిందా అనే కోణంలో విచారణ జరగనుంది. వివాదాల సంగతి పక్కన పెడితే, ఇదే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఒక అరుదైన రికార్డును చేరుకున్నారు. ముంబయి ఇండియన్స్‌పై ఐపీఎల్, ఛాంపియన్స్ లీగ్ కలిపి 1000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా కోహ్లీ రికార్డు సృష్టించారు. ఈ మ్యాచ్‌కు ముందు అతనికి 20 పరుగులు అవసరం కాగా, కేవలం 11 బంతుల్లోనే ఆ మార్కును చేరుకున్నారు. ప్రస్తుతం ముంబయిపై కోహ్లీ ఖాతాలో 1030 పరుగులు ఉన్నాయి. కేఎల్ రాహుల్ (977), శిఖర్ ధావన్ (901) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. తన ఫేవరెట్ టీమ్‌పై కోహ్లీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. మరోవైపు ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 18 పరుగుల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో మూడవ స్థానానికి చేరుకుంది. ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్ అర్ధశతకాలతో రాణించడంతో ఆర్సీబీ 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబయి ఆటగాళ్లు పోరాడినా లక్ష్యం పెద్దది కావడంతో ఓటమి తప్పలేదు. ఆర్సీబీకి ఇది మూడవ విజయం కావడం విశేషం.




# హార్దిక్ పాండ్యకు లక్షల్లో జరిమానా..

వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన పోరులో ముంబై ఇండియన్స్ జట్టు అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుత సీజన్‌లో 20వ మ్యాచ్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడిన ముంబై, 22 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. గతేడాది విజేతగా నిలిచిన బెంగళూరు జట్టు అద్భుత ప్రదర్శనతో ఈ సీజన్‌లో తన మూడవ విజయాన్ని నమోదు చేయగా, ముంబైకి ఇది వరుసగా మూడవ పరాజయం. సొంత మైదానంలో ఎదురైన ఈ ఓటమి జట్టు ప్రతిష్టను మసకబార్చింది. ఈ ఘోర పరాజయం తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు మరో చేదు వార్త అందింది. నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయడంలో విఫలమైనందుకు (స్లో ఓవర్ రేట్) భారత క్రికెట్ నియంత్రణ మండలి అతనిపై కఠిన చర్యలు తీసుకుంది. ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళి ప్రకారం, ఒక మ్యాచ్‌లో ఓవర్ల వేగాన్ని పాటించకపోతే జట్టు కెప్టెనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు హార్దిక్ పాండ్యాకు 12 లక్షల రూపాయల జరిమానా విధిస్తున్నట్లు నిర్వాహకులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. కేవలం ఓటమి మాత్రమే కాకుండా, హార్దిక్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కూడా విమర్శలకు దారితీశాయి. అనుభవజ్ఞుడైన బౌలర్ శార్దూల్ ఠాకూర్‌ను పది ఓవర్ల తర్వాత రంగంలోకి దించడంపై క్రీడా విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. శార్దూల్ తన మొదటి ఓవర్‌లోనే వికెట్ తీసి సత్తా చాటినప్పటికీ, అతనికి ఆలస్యంగా బౌలింగ్ ఇవ్వడం వల్ల ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధించే అవకాశం లభించింది. సోషల్ మీడియాలో సైతం అభిమానులు హార్దిక్ కెప్టెన్సీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్ నిబంధనల ప్రకారం, పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో 20 ఓవర్లను ఒక నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి. ఒకవేళ నిర్ణీత సమయం దాటినప్పటికీ ఓవర్లు పూర్తి కాకపోతే, అది క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా పరిగణిస్తారు. ఆదివారం నాటి మ్యాచ్ ముగియడానికి సాధారణం కంటే ఎక్కువ సమయం పట్టడంతో ప్రేక్షకులు కూడా ఇబ్బంది పడ్డారు. అందుకే తొలి తప్పుగా పరిగణిస్తూ హార్దిక్‌కు ఈ జరిమానా విధించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# బాలకృష్ణ, గోపీచంద్ కాంబో..థమన్ మ్యూడిజక్ డైరెక్టర్‌గా ఫిక్స్

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అనౌన్స్‌మెంట్‌తోనే హైప్ క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మ్యూజిక్ పనులతో మరో అడుగు వేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం, రెండు ట్యూన్స్‌ను పూర్తిచేసిన థమన్, వాటిలో ఒక సాంగ్‌కి ప్రముఖ లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్‌తో పాట రాయించినట్టు తెలుస్తుంది. ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ సాంగ్ షూట్ పూర్తయ్యిన వెంటనే అక్కడే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను ఒక రాజుగా చూపించగా, హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇది ఒక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బాలయ్య?నయనతార కాంబినేషన్ ప్రేక్షకులను పలుమార్లు మెప్పించింది. వీరిద్దరూ కలిసి నటించిన సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ జోడీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కథ, సెట్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఉండబోతున్నాయని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలయ్య–గోపీచంద్ మలినేని కాంబోలో వస్తున్న ఈ పీరియాడిక్ మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతుండగా, త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.

# భరతవర్ష్ మూవీతో వస్తోన్న గోపీచంద్

యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ప్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది.

# రణబాలి సెట్స్‌లోకి అడుగుపెట్టిన విజయ్ దేవరకొండ, రష్మిక

'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ – రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ – రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 – 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ – అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# మిర్యాలగూడలో 3 వేల మందికి ఉచిత పెరుగన్నం పంపిణీ చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అక్షర కలం

మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ నందు బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతిరోజు మధ్యాహ్నం 3 వేల మందికి పంపిణీ చేసే ఉచిత పెరుగన్నం పంపిణీ కార్యక్రమం 2వ రోజు ప్రారంభించిన దంపతులు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి బత్తుల మాధవి పెరుగన్నం పంపిణీ చేసారు..ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి విచ్చేసే ప్రజలకు,రైతులకు, ఉపసమనం కోసం రోజు దాదాపు 3 వేల మందికి పంపిణీ చేయడం జరుగుతుంది అని అన్నారు.. ఈ కార్యక్రమం జూన్ 2వ తేదీ వరకు కొనసాగుతుంది అని అన్నారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, చిలుకూరి సుధ బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కౌన్సిలర్లు, సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, బి,ఎల్,ఆర్,బ్రదర్స్, తదితరులు,పాల్గొన్నారు




## మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



అక్షరకలం దేవరకొండ

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నేరేడుగొమ్ము మండలంలో విస్తృతంగా పర్యటించారు. కొత్తపల్లి గ్రామంలో జిల్లాలోనే మొట్టమొదటి మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ప్రారంభించిన ఆయన, మహిళల ఆర్థిక సాధికారతకు ఇలాంటి భవనాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం కొత్తపల్లి, గుర్రపు తండాలలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్ 2 నుండి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పిస్తామని, సన్నరకం వడ్లకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని వివరించారు. మండల కేంద్రంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



అక్షరకలం దేవరకొండ

రైతులు పండించిన వడ్ల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి ఆయన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు మధ్యవర్తుల చేతిలో నష్టపోకుండా గిట్టుబాటు ధర పొందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, నేరుగా కేంద్రాల ద్వారానే పంటను విక్రయించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు నంబర్ ప్రతి ఒక్కరికీ అవసరం ; వ్యవసాయ అధికారి గిరిబాబు

### 20వ తేదీలోపు ఏఈఓలను సంప్రదించాలి

– మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు విజ్ఞప్తి

అక్షర కలం : చిట్యాల,


ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, పీఎం కిసాన్ మరియు యాప్ ద్వారా యూరియా సరఫరా వంటి పథకాల ప్రయోజనాలను పొందాలంటే రైతులు తప్పనిసరిగా తమ మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోవాలని చిట్యాల మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు సూచించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, మండలంలోని రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ?చాలామంది రైతులకు సంబంధించి వ్యవసాయ శాఖ రికార్డుల్లో సరైన మొబైల్ నంబర్లు లేకపోవడం వల్ల పథకాల సమాచారం అందడం లేదని ఆయన పేర్కొన్నారు. రైతు సోదరులందరూ వెంటనే తమ పరిధిలోని రైతు వేదికలకు వెళ్లి, అక్కడ ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి తమ మొబైల్ నంబర్లను సరిచేసుకోవాలని కోరారు. అన్ని పథకాలకు ఒకే మొబైల్ నంబర్ ఉండేలా చూసుకోవడం వల్ల సమాచారం త్వరగా అందుతుందని తెలిపారు. ?ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి రైతుకు 'రైతు గుర్తింపు నంబర్' ఉండటం విధిగా ఉండాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఈ నంబర్ పొందని వారు వెంటనే ఏఈఓల వద్ద గానీ లేదా మీ-సేవా కేంద్రాల్లో గానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు అనర్హులయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ?రాబోయే వర్షాకాలంలో రైతులు మొబైల్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, దీనికోసం మొబైల్ నంబర్ లింక్ అయి ఉండటం అత్యంత ఆవశ్యకమని ఆయన వివరించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఈ నెల 20వ తేదీ లోపు పూర్తి చేసి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సాయాన్ని పొందాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.



# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్





అక్షరకలం నల్గొండ

ధాన్యం కొనుగోలు వేగాంతం చేయాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నార్కట్ పల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని, లారీలను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.ఎక్కడైనా మిల్లుల సామర్థ్యం సరిపోకపోతే అదనపు మిల్లులను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అధికారి సర్టిఫికెట్ ఇచ్చే వరకు లోడింగ్ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ వరి పంట పరిస్థితులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెగుళ్ల గురించి ప్రశ్నించగా, ఒక రైతు పంటపై పురుగుమందులు పిచికారీ చేసినప్పటికీ చివరి దశలో దోమ కాటు కారణంగా నష్టం వాటిల్లిందని వివరించారు. మరో రైతు నాలుగు ఎకరాలు కౌలు తీసుకుని, రెండు ఎకరాలు స్వంతంగా కలిపి మొత్తం ఆరు ఎకరాల్లో వరి సాగు చేశానని తెలిపారు. అనంతరం మండలంలోని జివ్విగూడెం గ్రామంలో ఉన్న శివ సాయి వినాయక రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం ,గన్నీ బ్యాగుల నిల్వ గదులు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఇప్పటివరకు 10 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకున్నామని మిల్ యజమాని రవీందర్ రెడ్డి కలెక్టర్ కు తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం వేగవంతంగా అన్ లోడ్ చేసుకోవాలని, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. తహసిల్దార్ ఎల్. వెంకటేశ్వరరావు, పౌరసరఫరాల డీటీ దీపక్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ తరుణ్, మిల్లుయజమాని రవీందర్ రెడ్డి, అనిత రవీందర్ రెడ్డి, రైతులు ఉన్నారు.

## ఆర్టిజన్ కార్మికుల ధర్నాకు బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం సంఘీభావం



అక్షరకలం దేవరకొండ

తమ సమస్యల పరిష్కారం కోరుతూ దేవరకొండ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన ధర్నా బుధవారం ఎనిమిదవ రోజుకు చేరుకుంది. టి ఈ /ఏ ఈ /జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసన కార్యక్రమానికి దేవరకొండ డివిజన్ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు హాజరై పూర్తి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికుల ఆశయాలు నెరవేరాలని, వారికి ఏపీ (ఏపీ ) రోజులు వర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రెసిడెంట్ పెద్దిశెట్టి వసంత్ కుమార్, సెక్రటరీ నాతి యాదయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సైదులు, గౌరవ అధ్యక్షుడు యాదన్నతో పాటు వివిధ సబ్ డివిజన్ల నాయకులు, 1104 మరియు 327 యూనియన్ల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు. కార్మికుల న్యాయమైన పోరాటానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.

## మైనింగ్‌ను వెంటనే నిలిపివేయాలి: కాసారం గ్రామస్థుల ఆందోళన



అక్షరకలం దేవరకొండ

మండలంలోని కాసారం గ్రామంలో మైనింగ్ కార్యకలాపాలకు వ్యతిరేకంగా గ్రామస్థులు రోడ్డెక్కి భారీ నిరసన చేపట్టారు. మైనింగ్ లారీలను దిగ్బంధించి, పనులు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రజాభిప్రాయ సేకరణలో వ్యతిరేకత తెలిపినా, కంపెనీ మొండిగా పనులు కొనసాగించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ బ్లాస్టింగ్ వల్ల ఇళ్లకు బీటలు పడుతున్నాయని, రాత్రివేళల్లో శబ్దాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పశువుల మేత భూములు ధ్వంసమవుతున్నాయని, ధూళి కాలుష్యంతో ఆరోగ్యం దెబ్బతింటోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైనింగ్‌ను శాశ్వతంగా నిలిపివేసి గ్రామాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## తల్లిపాలే శిశువులకు శ్రీరామరక్ష



అక్షర కలం: చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని పెద్దకాపర్తి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో 8వ పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం 'పోషణ్ పక్షం-2026' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ మునుగోడు ప్రాజెక్ట్ ఏసీడీపీఓ వెంకటమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు మరియు చిన్న పిల్లల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహార విలువలు, మరియు పిల్లల మెదడు అభివృద్ధిపై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. పిల్లల్లో మొబైల్ వినియోగాన్ని తగ్గించేందుకు 'నో స్క్రీన్ అవర్' మరియు 'స్మైల్ టైమ్' గురించి వివరించారు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం మరియు పిల్లల ఎదుగుదలపై తల్లులకు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ఆహార పదార్థాలు, చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల వంటకాలపై ప్రదర్శన నిర్వహించి వాటి యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం. సుజాత, బి. గీత, పి. సత్యవతి, ఆయాలు మమత, అనసూయతో పాటు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను పరిశీలించిన మండల కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు (ఎం) అక్షర కలం



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న రోడ్డు పనుల గురించి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తో మాట్లాడగా స్పందించిన బీర్ల ఐలయ్య బిటి రోడ్డు బదులు సీసీ రోడ్డు వేసి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కి అధికారులకి సూచించారు. డబుల్ రోడ్డు పనులను పూర్తి చేయడం కోసం కృషి చేస్తున్న బీర్ల ఐలయ్య కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోతగాని మల్లేశం గౌడ్,స్థానిక వార్డ్ మెంబర్ బూడిద శేఖర్ ,ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఎలగందుల మహేష్,పంజాల రామకృష్ణ గౌడ్,వంగరి బుచ్చి రాములు నల్ల నర్సయ్య, బీసు నరహరి, లోడి నర్సయ్య గౌడ్, శ్రీను గౌడ్, జెట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# దేవరకొండలో 'తెలంగాణ మోడల్ స్కూల్' ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రీ-ప్రైమరీ నుండి ఇంటర్ వరకు ఒకే చోట విద్య

అత్యాధునిక వసతులతో పాఠశాల నిర్మాణం

జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

కలెక్టర్ తో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్

అక్షరకలం దేవరకొండ






గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం దేవరకొండలో తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. బుధవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తో కలిసి దేవరకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రతిపాదిత స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియట్) వరకు విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాల లే-అవుట్ ప్రకారం మోడల్ స్కూల్ నిర్మాణానికి స్థలం అత్యంత అనుకూలంగా ఉందన్నారు.ఈ మోడల్ స్కూల్లో విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయి వసతులను కల్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇందులో భాగంగా:విశాలమైన తరగతి గదులు, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ,డైనింగ్ హాల్, అత్యాధునిక కిచెన్ షెడ్.,ఆటల కోసం విశాలమైన ప్లే గ్రౌండ్.,మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యేక టాయిలెట్లు, బాత్రూమ్ సౌకర్యాలు., దూర ప్రాంత విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు.ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు ఈ మోడల్ స్కూల్ ఒక వరమని, దీని ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో పార్వతి, పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి మరియు ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కన్న తండ్రి చేతిలో రెండేళ్ల చిన్నారి దారుణ హత్య

చిన్నారి గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేసిన తండ్రి

కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

యాదాద్రి భువనగిరి అక్షర కలం



ఓం కసాయి కన్న తండ్రి కోపానికి రెండేళ్ళ చిన్నారి ప్రాణాలు కోల్పోయిన సంఘటన బుధవారం భువనగిరి మండలం హన్మాపురంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే హన్మాపురం గ్రామానికి చెందిన ఎర్రబోయిన శ్రీరాములు, హైదరాబాద్ కు చెందిన నాగరాణి దంపతులకు మూడేళ్ల క్రితం వివాహమైంది. ఒక సంవత్సరం పాటు దంపతుల కాపురం అన్యోన్యంగా సాగింది. కూతురు పుట్టడంతో గొడవలు మొదలయ్యాయి. ఆడపిల్ల కు జన్మనిచ్చిందని శ్రీరాములు రోజూ నాగరాణి తో గొడవ పడేవాడు. ఈ దంపతులు ఇద్దరూ శారీరక వైకల్య బాధితులే. శ్రీ రాములు మూగవాడు. నాగరాణి కి చెవుడు సమస్య.గత కొంత కాలంగా హైదరాబాద్ ఉన్న నాగరాణి ఈమధ్యే హన్మపురం వచ్చింది. మళ్ళీ గొడవలు జరగడంతో తండ్రికి ఫోన్ చేసి రమ్మంది. కూతురు, మనవరాలిని తీసుకెళ్ళడానికి నాగరాణి తండ్రి రావడంతో కోపంతో శ్రీరాములు, రెండేళ్ల కూతుర్ని తీసుకొని బయటకు వెళ్లి , వ్యవసాయ బావి వద్ద కూతురు గొంతు నులిమి చంపాడు. ఆ తర్వాత భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ కు వెళ్ళి జరిగిన విషయం చెప్పి పోలీసులకు లొంగిపోయాడు. రూరల్ ఎస్సై అనిల్ కుమార్ కేసు నమోదు చేసుకుని శ్రీ రాములును అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు శ్రీరాములు ను కఠినంగా శిక్షించాలని నాగరాణి తరపున బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

## అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమం లో భాగంగా చిల్డ్రన్స్ రోడ్డు సేఫ్టీ డే కార్యక్రమం



అక్షరకలం కోదాడ




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాలు మూడవ రోజున చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే భాగంగా కోదాడ ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో పట్టణంలో హుజూర్నగర్ చౌరస్తా వద్ద తేజా టాలెంట్ స్కూల్ విద్యార్థులతో కలిసి మానవహరం నిర్వహించి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అంజిరెడ్డి విద్యార్థులతో మానవహారం నిర్వహించి రోడ్డు నియమాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రోడ్డు నియమాల పట్ల రహదారి వినియోగం పట్ల పాటించాల్సిన జాగ్రత్తల పట్ల తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన అంశాల పట్ల వివరించడం జరిగింది. మానవ తప్పిదాల వల్ల అధిక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ డిఫెన్స్ డ్రైవింగ్ చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ఎస్ఐ తెలిపారు. నేటి బాలలు రేపటి పౌరులు, రోడ్డు ప్రమాదాలు సంభవించి ఏ ఒక్క యువత అర్ధంతరంగా మరణించకూడదు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు తీసుకు వెళ్ళేటప్పుడు తీసుకు వచ్చేటప్పుడు తప్పకుండా ద్విచక్ర వాహనంపై ఉన్నవారు హెల్మెట్స్ ధరించాలి. కార్లు ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. హెల్మెట్ వినియోగము సీట్ బెల్ట్ వినియోగం గురించి పిల్లలు తల్లిదండ్రులకు వివరించాలి అని తెలిపారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, యువత ట్రిబుల్ రైడింగ్ బైక్ రేసింగ్ లాంటిది నిర్వహించకూడదని తెలిపారు. రహదారి వినియోగంలో విద్యార్థులు యువత తప్పక నియమాలు పాటించాలని జిబ్రా క్రాసింగ్లు వైట్ లైన్స్ ఉన్న చోట రోడ్లు దాటాలని కోరారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి

అక్షర కలం,చౌటుప్పల్:





సంస్థాన్ నారాయణపురం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకెపి సెంటర్ల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతుల వద్ద వడ్లను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం సిపిఐ,రైతు సంఘం నాయకులతో కలిసి నారాయణపురం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.అనంతరం అక్కడ ధాన్యం పోసిన రైతులతో మాట్లాడారు గత కొన్ని రోజులుగా ధాన్యం ఆరబోసి సాయంత్రం వేళ కప్పి ఇండ్లకు వెళ్తున్నారని వర్షం వస్తే వడ్ల మీద కప్పడానికి టర్పాలిన్ సౌకర్యం కూడా లేదని అన్నారు.రైతులకు ఎండ తాకిడి తగలకుండా పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా టెంటు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.ప్రభుత్వం రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్తున్న కిందిస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా సరిగ్గా అమలు కావడం లేదని ఆయన అన్నారు.అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు,రైతులు, పాల్గొన్నారు.

# కోదాడ ఎమ్మార్వో కార్యాలయంలో అవినీతి బాగోతం.!



నిబంధనలకు వ్యతిరేకంగా భూమి బదలాయింపు.!!

తనకు అధికారులు అన్యాయం చేశారని బాధితుడు జహీర్ అహ్మద్ ఆవేదన



అక్షరకలం కోదాడ

కోదాడ మండలం ద్వారకుంట రెవెన్యూ పరిధిలోని 134 సర్వే నెంబర్ లో గల ఐదు ఎకరాల రెండు గుంటల భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా రెవెన్యూ అధికారులు కోదాడకు చెందిన జలీల్ నాయక్ పేరు పైకి మార్చారని బాధితుడు జహీర్ అహ్మద్ బుధవారం కోదాడ ఆర్టీవో కార్యాలయం ముందు అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన తెలిపి విలేకరుల సమావేశంలో రోధిస్తూ వెల్లడించారు. తన తల్లి అహ్మద్ ఉన్నిసా బేగం పేరా ఈ భూమి ఉందని గత ఏడాది జులైలో సెల్ కం జిపిఏ డాక్యుమెంటు తో ఈ భూమిని నాలా కన్వర్షన్ మూటేషన్ చేశారని వాపోయాడు. ఎమ్మార్వో కార్యాలయంలో పనిచేసే టర్మినేట్ అయిన ధరణి ఆపరేటర్ వెంకయ్య, ఈ దందాలో కీలక వ్యక్తి అని ఆరోపించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ సీనియర్ నాయకుడు ఒకరు ఎమ్మార్వో పైకి ఒత్తిడి తీసుకువచ్చి వీరికి సహకరించారని తెలిపారు. ఇట్టి భూమి పంచనామా సైతం అర్ ఐ జగదీష్ భూమి వద్దకు వెళ్లి ప్రక్కన రైతులతో కాకుండా వారికి అనుకూలమైన వ్యక్తులతో సాక్షిగా సంతకాలు చేయించి పంచనమా చేశారని క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ముడుపులు తీసుకొని రిపోర్టు ఇచ్చారని ఆరోపించారు. ఇదే విషయమై తనకు న్యాయం జరగాలని లోకాయుక్తను ఆశ్రయించానని బాధితులు వాపోయాడు. స్థానిక ఎమ్మార్వో వాజీద్ అలీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించి భూమిని తమకు కాకుండా చేశాడని ఇప్పటికైనా పై అధికారులు స్పందించి తమకు న్యాయపరంగా చెందల్సిన భూమిని అప్పగించి అక్రమంగా భూమిపై హక్కులు కల్పించిన ఎమ్మార్వో, ఆర్ ఐ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తన తల్లి 2010లో మృతి చెందినదని కాగా 2006లో జిపిఏ చేసిందని తెలిపారు. చనిపోయిన తర్వాత 2025 జూలైలో అధికారులు జిపిఏతో అన్యాయంగా ముటేషన్ చేశారని తెలిపారు. వ్యక్తి చనిపోయిన తర్వాత జిపిఏ చెల్లదని అధికారులకు తెలిసిన ముడుపులతో చేశారని ఆరోపించారు.

## వాహనదారుల భద్రతే ప్రాధాన్యం : రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

వేలిమినేడు వద్ద రోడ్డు ప్రమాదాల అవగాహన హోర్డింగ్‌ను ప్రారంభించిన డిజిపి

అక్షరకలం : చిట్యాల




రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వేలిమినేడు వద్ద 65 వ నంబర్ జాతీయ రహదారి నల్లగొండ జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాల అవగాహన హోర్డింగ్‌ను రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ?ఈ కార్యక్రమంలో డీజీపీతో పాటు డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.?హోర్డింగ్ ప్రారంభోత్సవం అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారులపై నిబంధనలు పాటించకపోవడం వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ల ముఖ్యంగా రాత్రి వేళల్లో గూడ్స్ వాహనాల వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు ?రేడియం స్టిక్కర్లు తప్పనిసరి అని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రతి గూడ్స్ క్యారియర్ వాహనానికి కన్స్పాన్ రేడియం స్టిక్కర్లు మరియు రేర్ మార్కింగ్ ప్లేట్స్ కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను డీజీపీ ఆదేశించారు వేలిమినేడు సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి డీజీపీ శివధర్ రెడ్డిని కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. జాతీయ రహదారి 65పై ఉన్న పిట్టంపల్లి క్రాస్ వద్ద చీకటి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడ తక్షణమే హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేసి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ రవికుమార్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## ఇసుక రవాణాకు అనుమతులు తప్పనిసరి

ఇసుక అక్రమ రవాణా కు చెక్ పెట్టాలి.

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

(అక్షర కలం, నారాయణపేట జిల్లా, రిపోర్టర్, ఏప్రిల్,15)

జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్ లతో పాటు రెవెన్యూ,వాటర్ షెడ్ పరిధిలోని చెక్ డ్యాం ల వద్ద నుంచి ఇసుక రవాణా చేసేందుకు అనుమతులు తప్పని సరి అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ అధ్యక్షతన డి.ఎల్.ఎస్.సి( డిస్టిక్ లెవెల్ స్యాశీడ్ కమిటీ) సమావేశం గూగుల్ మీట్ ద్వారా జరిగింది. వీసీ హాల్ నుంచి కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను, భూగర్భ జల వనరుల శాఖ ఏ డీ రవి, కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, మిషన్ భగీరథ ఎస్. ఈ. రంగారావు, ఇరిగేషన్ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇసుక తరలింపు విషయంలో మైనింగ్, రెవెన్యూ, భూగర్భ జల శాఖ, సర్వే ల్యాండ్, నీటి పారుదల,వ్యవసాయ శాఖల అధికారుల నివేదికలు,అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఇరిగేషన్, నీటి జల వనరుల శాఖ ఏ డీ ని ప్రశ్నించారు. మాగనూరు మండలంలోని 5 ఇసుక రీచ్ లు, ఉట్కూర్ మండలంలో 2, మక్తల్ లో రెండు,ధన్వాడ గోటూరు, కొత్తపల్లి, లింగాల చేడ్ రీచ్ ల నుంచి ఇసుక రవాణా కు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని మైనింగ్ ఏడి వివరించారు. గుర్తించిన ప్రాంతాల నుంచి నిబంధనల మేరకు ఇసుక రవాణా కు అనుమతులు ఇవ్వాలని, ఆయా ప్రాంతాలలో సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి, పారదర్శక మైన నివేదికలను ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఒకరిద్దరు తహసీల్దార్ల పనితీరు పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గూగుల్ మీట్ లో ఆయా మండలాల తహసీల్దార్లు, సిఐలు,ఎస్.ఐ. లు, కలెక్టరేట్ లోని సంబంధిత సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి


# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల సందడి

## దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల

**అక్షరకలం, చండూరు**



నల్గొండ జిల్లా చండూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఘనశ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసిన ప్రకారం ఏప్రిల్ 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని,?అర్హులైన విద్యార్థులు రూ. 200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఇక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.?ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది.?రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో విద్యార్థిని విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.కళాశాలలో ప్రస్తుతం బి.ఎ (ఇ.హెచ్.పి) – ఇంగ్లీష్ ఉ తెలుగు మీడియం, మరియు బి.కామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీ మరియు కంప్యూటర్ ల్యాబ్ వంటి అత్యాధునిక వసతులు ఉన్నందున, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.




# బాల్యం నుండే ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన పెంచుకోవాలి

## భువనగిరి ట్రాఫిక్ డిఎస్పీ ప్రభాకర్ రెడ్డి





**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

చిన్నతనం నుంచే రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన పెంచుకొని, ప్రమాదాలను నివారించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ట్రాఫిక్ డిఎస్పీ ప్రభాకర్ రెడ్డి కోరారు. బుధవారం భువనగిరి పట్టణ శివారులోని దివ్య బాల విద్యాలయం లో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు , అధికారులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రమాణం చేశారు. మానవహారం నిర్వహించారు. విద్యాసంస్థల బస్సులను (ఈఐబి) తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాహన పత్రాలు, డ్రైవర్ లైసెన్సులు, మరియు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలల వద్ద, బస్సులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే ఆగేలా చూసేందుకు, నిర్దేశిత పికప్ మరియు డ్రాప్ పాయింట్లను స్పష్టంగా గుర్తించి, గుర్తు పెట్టారు. బస్సు ఎక్కేటప్పుడు మరియు దిగేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను నొక్కి చెబుతూ, పాఠశాల బస్సు సిబ్బందికి మరియు పిల్లలకు భద్రతా మార్గదర్శకాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా రవాణా అధికారులు, భువనగిరి ట్రాఫిక్ ఎస్. హెచ్. ఓ, ఇతర అధికారులు మరియు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు పేద ప్రజలకు వరం అని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని 18 వ వార్డులో ఇందిరమ్మ ఇంటిని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ పాశం అమర్ నాథ్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



# దక్షిణానికి 'డీలిమిటేషన్' ముప్పు

**కేంద్రంపై వీహెచ్ నిప్పులు**

**జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం**

**కులగణన చేపడితేనే బడుగు బలహీన వర్గాలకు అసలైన న్యాయం**

**బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాల్సిందే**

**నేడు ఢిల్లీలో భారీ ధర్నా విజయవంతం చేయాలని పిలుపు**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ దక్షిణ భారతదేశ రాజకీయ ఉనికిని దెబ్బతీసేలా ఉందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు (వీహెచ్) ఘాటుగా విమర్శించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పున్నా కైలాష్ నేతతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు.దక్షిణ రాష్ట్రాల ప్రభావం తగ్గే ప్రమాదం ఏర్పడుతుందన్నారు.?కేవలం జనాభా ప్రాతిపదికనే డీలిమిటేషన్ చేపడితే, కుటుంబ నియంత్రణ పాటించి అభివృద్ధి చెందుతున్న దక్షిణ రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్లు తగ్గిపోతాయని వీహెచ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెరిగి, దేశ రాజకీయాల్లో దక్షిణాది ప్రభావం నామమాత్రంగా మారుతుందని హెచ్చరించారు. ప్రతిపక్షాలతో చర్చించకుండా కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు.






### కులగణన -- బీసీల హక్కు...

జనగణనతో పాటు కులగణన కూడా తప్పనిసరిగా చేపట్టాలని వీహెచ్ డిమాండ్ చేశారు.జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. జనాభా ఆధారంగానే బలహీన వర్గాలకు రాజకీయ హక్కులు దక్కాలి.దేశంలో 60 శాతానికి పైగా ఉన్న బీసీల సంక్షేమం కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కేటాయించాలని స్పష్టం చేశారు.

### -సెక్యులర్ భారత్‌ను కాపాడుకుంటాం..

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలని చూస్తోందని వీహెచ్ ఆరోపించారు. భారత్ ఎప్పటికీ సెక్యులర్ దేశమేనని, రాజ్యాంగ విలువలకే తమ ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఏప్రిల్ 16న ఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### -జ్యోతిబా పూలేకు నివాళులు-

మీడియా సమావేశానికి ముందు వీహెచ్ మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేతతో పాటు కాంగ్రెస్ నాయకులు గుడిపాటి లక్ష్మీనరసయ్య, ముంతాజ్ అలీ, అన్నెబోయిన సుధాకర్, నోముల జనార్దన్, రవీందర్ రెడ్డి, ధనుంజయ, సైదులు, మేకల సాగర్ రెడ్డి, జిల్లా వెంకటేశం, జస్వంత్, చిలుకరాజు సతీష్, జేరిపోతుల రమేష్ గౌడ్, వెంకట నరసయ్య, కర్నాటి యాదగిరి, గాజుల శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాదికి అన్యాయం జరగనివ్వద్దు

**డీలిమిటేషన్ పద్ధతి మారాలి**

**మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**జనాభా కాదు.. జీఎస్టీనే ప్రాతిపదిక కావాలి**

**జమిలీ ఎన్నికలపై స్పష్టత, రాష్ట్రాల విభజనపై విశ్లేషణ**

**బీఆర్ఎస్ 'ఆత్మ విమర్శ' చేసుకోవాలి**

**రాజకీయాల్లో పెరిగిన ధన ప్రవాహం**

**కాలువల విస్తరణే రైతులకు శ్రీరామరక్ష**

**ఏఎమ్మార్పీ నీటి సామర్థ్యం 4000 క్యూసెక్కులకు పెంచాలి**

**లైనింగ్‌కు ముందే కాలువలు వెడల్పు చేయాలని డిమాండ్**

**తెలంగాణ.. వలస కూలీల అడ్డా**

**రాష్ట్రంలో 20 లక్షల మంది ఇతర రాష్ట్రాల వారికి ఉపాధి లభిస్తోందని వెల్లడి**

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన నల్గొండలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. దేశ రాజకీయాలు, రాష్ట్ర పరిస్థితులు, సాగునీటి రంగంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై ప్రతిపాదనలు డీలిమిటేషన్ ప్రక్రియలో జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకూడదని గుత్తా పేర్కొన్నారు. ప్రస్తుతమున్న సీట్లను 50 శాతం పెంచేలా కేంద్రం ప్రతిపాదిస్తోందని, అయితే 50 శాతం జనాభా, 50 శాతం జీఎస్టీ ప్రాతిపదికన విభజన జరగాలని పలు రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. ? మహిళా రిజర్వేషన్ బిల్లును, డీలిమిటేషన్ బిల్లును విడివిడిగా ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు.

### రాజకీయాలు - జమిలీ ఎన్నికలు....

ఒకే దేశం – ఒకే ఎన్నికలు అమలైతే, దేశంలోని 18 రాష్ట్రాలు ఒక విడతలో, మిగిలిన రాష్ట్రాలు మరో విడతలో ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని విశ్లేషించారు. ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని అరికట్టకుంటే సామాన్యుడు రాజకీయాల్లో పోటీ చేసే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.
?అధికార పార్టీలో అసంతృప్తి సహజమని వ్యాఖ్యానిస్తూనే, బిఆర్ఎస్ ను తిరిగి టిఆర్ఎస్ గా మారుస్తారన్న ప్రచారంపై స్పందించారు. పార్టీ పేరు మార్పుపై ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

### రైతాంగ సమస్యలు...

ధాన్యం సేకరణపై స్పష్టతనిస్తూ, ప్రస్తుతం సన్నధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా ఇబ్బందులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం 80 శాతం రా రైస్ అడుగుతుంటే, మిల్లర్లు మాత్రం బాయిల్డ్ రైస్‌కే మొగ్గు చూపుతున్నారని చెప్పారు. ముఖ్యంగా వేసవి కాలంలో రా రైస్ సేకరిస్తే నూక శాతం ఎక్కువగా వస్తుందని వివరించారు. సిఎంఆర్ ధాన్యం సేకరణలో పూర్తి నియంత్రణ ఉండాలని, అయితే మిల్లులను మూసివేసే పరిస్థితి లేదని.. ఒకవేళ మిల్లులు మూతపడితే ధాన్యం కొనేవారే ఉండరని గుర్తుచేశారు.

### సాగనీటి కాలువల విస్తరణ...

నల్గొండ జిల్లా ప్రయోజనాల దృష్ట్యా సాగునీటి వ్యవస్థపై ఆయన కీలక సూచనలు చేశారు.ఏఎమ్మార్పీ ప్రస్తుతం 2400 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తోందని, దీనిని 4000 క్యూసెక్కులకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.సాగునీటి కాలువలకు లైనింగ్ పనులు చేపట్టే ముందే వాటి విస్తరణ పూర్తి చేయాలని, దీనివల్ల రైతులకు చిట్టచివరి భూములకు కూడా నీరందుతుందని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాల నుండి వచ్చే సుమారు 20 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పిస్తోందని, ఇది రాష్ట్ర ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.

### ప్రత్యక్ష రాజకీయాల్లోకి గుత్తా రీ-ఎంట్రీ

### అసెంబ్లీ లేదా పార్లమెంట్‌కు పోటీ సిద్ధం.!

రాజకీయ కురువృద్ధుడు, తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన మనసు మార్చుకున్నారు. కొద్దిరోజుల క్రితం వరకు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటానని, తన వారసుడు అమిత్ రెడ్డిని బరిలోకి దింపుతానని చెప్పిన ఆయన, ఇప్పుడు స్వయంగా రంగంలోకి దిగేందుకు మొగ్గు చూపుతున్నట్లు ఆయన వెల్లడించారు.తన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని వృథా పోనివ్వనని గుత్తా స్పష్టం చేశారు. "రాజకీయాల్లోకి వస్తున్న కొత్త తరాన్ని సన్మార్గంలో నడిపించాలంటే నా లాంటి అనుభవజ్ఞుల అవసరం ఎంతో ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న కొత్త తరం ధోరణిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వారు వక్రమార్గంలో వెళ్లకుండా 'బ్రేకులు' వేయాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు.

### పీవీ, నీలం సంజీవరెడ్డిలే స్ఫూర్తి

రాజకీయాల నుంచి విరమించుకుందామనుకున్న తరుణంలో కీలక పదవులు వరించిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిలను ఆయన ఉదహరించారు. పీవీ ప్రధాని కావడం వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, అదే బాటలో తాను కూడా ప్రజా సేవలో కొనసాగుతానని సంకేతాలిచ్చారు.వచ్చే ఏడాది నవంబర్‌లో గుత్తా ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనుంది. ఈ లోపు నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొత్తగా ఆరు నియోజకవర్గాలు వచ్చే అవకాశం ఉందని ఆయన అంచనా వేస్తున్నారు.అయితే ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కావాలనే తన చిరకాల వాంఛను నెరవేర్చుకోవాలని ఆశిస్తున్నారు.నకిరేకల్, నల్గొండ లేదా మిర్యాలగూడ నియోజకవర్గాల్లో మార్పులు జరిగితే తనకు కలిసొస్తుందని భావిస్తున్నారు.



# అంగన్వాడి టీచర్ల సేవాచాలా గొప్పది.

ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య.





అక్షర కలం / ఇల్లందు.

అంగన్వాడి టీచర్ల సేవా చాలా గొప్పదని ఇంట్లో ఉన్న ఒక చిన్న పిల్లని చూడడమే తల్లులకు చాలా కష్టంగా వున్న పరిస్థితి లో అంగన్వాడీ కేంద్రంలో చేరిన చిన్న పిల్లలందరినీ చూడడం ఎంతో కష్టమె మనకు తెలుసని అలాంటి పరిస్థితిని ఎంతో నేర్పుతో, సహనంతో, ఓపికతో, ప్రేమ, ఆప్యాయతని కురిపిస్తు పోషకాహారాన్ని అందిస్తూ అవసరమైతే కాల కృత్యాలను సైతం తీరుస్తూ శిశు సంరక్షణ బాధ్యతలను మోస్తున్న అంగన్ వాడి టీచర్ల సేవా ఆమోగ మైనదని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. తొలుత ఇల్లందు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని అరుణ కుమారి అధ్యక్షతన బుధవారం జరిగిన అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్ పంపిణి కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, బాలాజీ నగర్ సర్పంచ్ పాయం స్వాతి మాట్లాడారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి టీచర్ల సౌలభ్యం కోసం శిశు సంరక్షణకు సంబంధించి యుక్త వయసు వయసు ఆడపిల్లల డేటా, గర్భిణీ స్త్రీల డేటా, కుటుంబ లో ఉన్న స్త్రీ పురుషుల డేటా, మూడు నుండి ఆరు సంవత్సరాల శిశువుల వివరాల డేటా, మొదలగు విషయాలకు సంబంధించిన నమోదు కార్యక్రమం డేటాలను ప్రభుత్వం అందించిన యాప్ ద్వారా అంగన్వాడీ టీచర్లు ఆన్లైన్ చేసేందుకు కొత్త స్మార్ట్ఫోన్లను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అంతేకాక అంగన్వాడి టీచర్ల ఇబ్బందులను సూచనలను నేరుగా ప్రభుత్వానికి తెలియజేసేందుకు స్మార్ట్ ఫోన్లను అందించడం అభినందించదగ్గ విషయం అన్నారు. అంగన్వాడీ టీచర్లు తమ పరిధిలో ఉన్న స్త్రీలు గర్భిణి ధరించిన నాటినుండి డెలివరీ అయిన శిశు వులు పెరిగి నడిచేంతవరకు వారి ఆలనా పాలనను చూస్తూ తల్లులకు సరి అయిన పోషకారాన్ని అందిస్తూ ఎలాంటి పోషక వస్తువులు తీసుకోవాలో చెబుతూ ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకుంటూ అవసరమైన వైద్యం అందిస్తూ కంటికి రెప్పలాగా చూస్తున్న అంగన్వాడీ టీచర్ల కృషి సేవ చాలా అమూల్యమైనదని శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు.మీకు శిశు సంరక్షణ విషయంలో కానీ మరే విషయంలో కానీ ఇబ్బందులు ఉంటే తనను సంప్రదించాలని, అంగన్వాడి టీచర్ల జిల్లా రాష్ట్ర సంఘాలతో ఈ శాఖను నిర్వహిస్తున్న మంత్రివర్యులు సీతక్కతో మాట్లాడించే బాధ్యతను తను తీసుకుంటానని కోరం కనకయ్య తెలిపారు. అనంతరం అంగన్వాడీ టీచర్లకు, సూపర్వైజర్లకు మంజూరైన 179 స్మార్ట్ ఫోన్ లను శాసనసభ్యులు కోరం కనకయ్య చేతుల మీదుగా పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, ఇల్లందు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, బాలాజీ నగర్ ఉపసర్పంచ్ కట్టోజు ఈశ్వరమ్మ, ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి సైదులు, బాలాజీ నగర్ గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు వేముల వెంకట్, అఖిల్, శైలజ, వంశీ ప్రియ, మాజీ వార్డు మెంబర్ టి. విజయ్, ఇల్లందు తాటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం లో ముప్పై మూడు కేజీల ఆరు వందల గ్రాముల ఎండు గంజాయి పట్టివేత



అక్షర కలం / భద్రాచలం

బుధవారం రోజున ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ ,ఈఎస్ కె.తిరుపతి, గార్ల ఆదేశాల మేరకు ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ ఐ. చావా. శ్రీహరి రావు, మరియు సిబ్బంది కలిసి భద్రాచలం ఇసుక ర్యాంపు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగాఅనుమానాస్పదంగా నిలిపి ఉంచిన కార్ ( తీవస్త్ర అశీ: ాణ 30 ం 3732 ) ను తనిఖీ చేయగా దానిలో 33.6 నస్త్ర ల ఎండు గంజాయి లభ్యమైంది.ఇట్టి గంజాయి మరియు కారు కి సంబంధించిన వారి కోసం పరిసర ప్రాంతాలలో గాలించగా ఎవరును కనిపించలేదు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఇట్టి గంజాయిని మరియు 1 కార్ ను భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ లోఅప్పగించడమైనది.ఈతనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుల్స్ రమేష్ బాబు,వీరబాబు,ప్రసన్న కుమార్,తిరుపతి,ఉపేందర్ లు పాల్గొన్నారు. ఏదైనా గంజాయి కి సంబంధించిన సమాచారం ఉన్నచో టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు సమాచారం అందించగలరని, మీ వివరాలు గోప్యం గా ఉంచబడతాయి అని ఎస్ ఐ.తెలియజేశారు.

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా వి రాములు బాధ్యతల స్వీకరణ

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15:

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా వి రాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.



# మండల సభలకు పకడ్బందీ ఏర్పాట్లు...

- వేసవిలో త్రాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.....

- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్..

మెదక్/ కొల్చారం ఏప్రిల్ 15(అక్షర కలం):-






ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 21న మండల కేంద్రాలు,04 మున్సిపాల్టీలో నిర్వహించనున్న సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ . అధికారులను ఆదేశించారు. బుదవారం జిల్లా కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ముందస్తుగానే సభా వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో, ఇతర మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, నూతన రేషన్ కార్డుల పంపిణీ,సన్న బియ్యం పంపిణీ, గృహలక్ష్మి, మహాలక్ష్మి, ఇందిరా మహిళా శక్తి పథకం,కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సన్న వడ్ల బోనస్,ఇతర సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు,ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్దిదారుల వివరాలు చదివి వినిపించాలని, లబ్ధిదారులతో వారి అనుభవాలను ప్రజలకు తెలియజేసేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో వచ్చిన అర్జీలను మండల సభలకు ముందు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సభలకు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, అందరూ భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. సభ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా రాష్ట్ర గేయం, వినిపించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్ కార్యక్రమం గురించి సభల్లో తెలియజేయాలని అన్నారు ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టాలన్నారు.. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలన్నారు. అనంతరం వేసవికాలంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకునే విధంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ క్షేత్రస్థాయిలో ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారుల సమన్వయంతో తాగునీటి సమస్యకు నిర్మూలనకు కృషి చేయాలని, నీటి ఎద్దడి ముందుగా గుర్తించిన పక్షంలో ప్రత్యామ్నాయ చర్యల ద్వారా సమస్యను పరిష్కరించాలన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఎండలు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలనివేసవిలో ప్రజలు ఎండలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య రక్షణ చర్యలు పాటించాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ఉండాలని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మధ్య ఎండ అధికంగా ఉంటుందని ప్రజలు బయటికి వెళ్లొద్దని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడ దెబ్బబారిన పడే అవకశాలున్నాయని, తద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వడదెబ్బకు గురైతే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎండల్లో చిన్నారులు, వయోవృద్దులతో ప్రయాణం చేయొద్దని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుండి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా, టోపితో కవరు చేసుకోవాలన్నారు. తరచుగా మంచినీళ్లు త్రాగాలని సూచించారు. మజ్జిగ, నిమ్మరసం, ఉప్పు పంచదార కలిపిన ద్రావణం, ఓఆరెస్ తీసుకోవాలని తెలిపారు. వదులుగా ఉన్న కాటన్ దుస్తువులు ధరించాలని తెలిపారు. ఎండలు వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు, పొడిబారడం లాంటి మార్పులను గమనించాలని తెలిపారు. వేడి వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయక తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు 108 కు ఫోన్ చేయాలని అన్నారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలుకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుండి 11, సాయంత్రం 4 నుండి 6 గంటలు వరకు పనులు చేపించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా షేడ్ నెట్స్, ఓఅర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఎండదెబ్బ తగలకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ గూగుల్ మీట్లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య,జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ఎస్ శివదయాల్, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస్, డీఎఫ్ఓ జో.జి , జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డిపిఓ యాదయ్య, ఆర్ అండ్ బి ఈ.ఈ వేణు,ఆర్.డబ్ల్యూ.ఎస్ మిషన్ భగీరథ. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల చైతన్యం - పెద్దల ప్రాణాలకు రక్షణ కవచం

హెల్మెట్ ధరించమని గుర్తు చేసే పిల్లలు - కుటుంబాన్ని కాపాడే హీరోలు

భావి పౌరుల చేతుల్లోనే - సురక్షిత భారత్ భవిష్యత్తు.

హెల్మెట్ ఒక అలవాటు కాదు... ప్రాణాల రక్షణ కవచం"

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు,

జోగులాంబ గద్వాల (అక్షర కలం )



99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా లోని అలంపూర్ పట్టణంలోని మౌంటేశ్వరి హై స్కూల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో విశేష చైతన్యం నింపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు ఐపీఎస్ గారు, భావి భారత పౌరులైన విద్యార్థులకు భద్రతపై స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, "ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు 'నా వల్ల నాకు గానీ, ఇతరులకు గానీ ప్రమాదం జరగకూడదు' అనే ఆలోచనతో ప్రయాణం ప్రారంభిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలం" అని అయన పేర్కొన్నారు. ప్రపంచం అంతరిక్షంలో అద్భుతాలు సాధిస్తున్న ఈ కాలంలో కూడా, మన రోడ్లపై అవగాహన లోపం వల్ల ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులే కుటుంబాల్లో మార్పుకు దూతలుగా మారాలని, తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ, వారి భావోద్వేగ ప్రభావం కుటుంబంపై ఎక్కువగా ఉంటుందని, తండ్రులు, అన్నలు బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించమని ప్రేమగా కోరితే అది అలవాటుగా మారుతుందని సూచించారు. స్కూల్లో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో, రోడ్డు పై కూడా అదే క్రమశిక్షణ ప్రాణాలను కాపాడుతుందని ఆయన స్పష్టం చేశారు. తదుపరి దేశంలో ఉన్న అందరి చేత రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించే సరైన విధానం, జీబ్రా క్రాసింగ్ ఉపయోగం వంటి అంశాలను ప్రాక్టికల్ డెమో ద్వారా విద్యార్థులకు వివరించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ గారు సీట్ బెల్ట్ అవసరాన్ని వివరిస్తూ, ప్రతి ప్రయాణం భద్రంగా ఉండాలంటే నియమాలు పాటించడం తప్పనిసరి అని చెప్పారు. అత్యంత ప్రభావవంతంగా, రెండు బైక్లు ఢీకొన్న సందర్భంలో జరిగిన ప్రమాదశీ పై నిర్వహించిన స్కిట్ విద్యార్థులను ఆలోచింపజేసింది. హెల్మెట్ లేని వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం, హెల్మెట్ ధరించిన వారు క్షేమంగా బయటపడడం ద్వారా భద్రత యొక్క అసలు విలువను స్పష్టంగా చూపించారు. అనంతరం విద్యార్థులు సందేశంతో మానవహారం నిర్మించి సమాజానికి శక్తివంతమైన సందేశం అందించారు.గద్వాల్ డీఎస్పీ మొగిలయ్య గారు మాట్లాడుతూ, మైనర్ డ్రైవింగ్ పై కఠిన చర్యలు ఉంటాయని, రూ.25,000 జరిమానా మరియు తల్లిదండ్రులకు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని స్పష్టం చేశారు. స్కూల్ యాజమాన్యం సందేశంతో ప్రమాదాల తీవ్రతను వివరించింది. ఈ కార్యక్రమంలో గద్వాల్ డీఎస్పీ వై. మొగిలయ్య, సీఐ ప్రదీప్ కుమార్, ఎంవీఐ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో పద్మావతి, ఎంఈఓ అశోక్ కుమార్, స్కూల్ కరస్పాండెంట్ ఢ ప్రిన్సిపాల్ కేఎన్వి రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక.నగేష్,ని మర్యాద పూర్వకంగ కలిసిన భద్రాచలం బార్ అసోసియేషన్

అక్షర కలం / భద్రాచలం

బుధవారం రోజున భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, గౌరవనీయులైన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక.నగేష్ ,ని ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిసి,భద్రాచలంప్రాంతానికి సంబంధించిన్యాయసేవ లఅభివ ృద్ధిఅంశంపై ముఖ్య వినతినిసమర్పించారు. ప్రస్తుతంభద్రాచలంమరియుమణుగూరు పరిధిలోని కేసులు దూర ప్రాంతాలకు తరలించబడుతున్న నేపథ్యంలో, స్థానిక ప్రజలు మరియు న్యాయవాదులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనిబార్అసోసియేషన్ ప్రతినిధులు న్యాయమూర్తి కి వివరించారు.ముఖ్యంగా భద్రాచలం జూరిస్డిక్షన్ పరిధిలోనే మణుగూరు ప్రాంతాన్ని పరిగణలోకి తీసుకుని, ఇక్కడే ఒక సెషన్స్ కోర్టు లేదా కనీసం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయడం అత్యవసరం అని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా గౌరవ న్యాయమూర్తి భీమపాక నగేష్ గారు ప్రతిపాదించిన అంశాలను శ్రద్ధగా ఆలకించి,సమస్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, దీనిపై సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి, సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామనిహామీఇచ్చారు .ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి.శ్రీనివాసన్, ఉపాధ్యక్షులు సున్నం.రమేష్ , ప్రధాన కార్యదర్శి పూసాల.శ్రీనివాస చారి,సంయుక్తకార్యద ర్శితాత.లలిత,లైబ్రరీకార్యదర్శిపగడ ాల.కవిత,సాంస్కృతిక కార్యదర్శికోర్స.కృష్ణార్జునరావు,తోపాటుసీనియర్ న్యాయవాదులు ఎం.వి. రమణరావు,కోట.దేవదానం, గోడపర్తి.నాగరాజు,ఎస్. కే. అక్తర్, పోకల.మోహన్ కృష్ణ,ధనసరి.మూర్తి,రవితేజ,ఆశ్రిత, తదితరులు పాల్గొన్నారు. భద్రాచలం ప్రాంతంలో న్యాయ సేవలను మరింత బలోపేతం చేయడానికి ఈ చర్యలు కీలకమని, స్థానిక ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో ఈ నిర్ణయంఎంతోసహాయపడుతుందని బార్ అసోసియేషన్ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు గౌరవ న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.



# మహమ్మద్ జావేద్ మృతి పట్ల మంత్రి పొంగులేటి తీవ్ర దిగ్భ్రాంతి

– నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని ప్రకటన

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



ఖమ్మం : ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ దుర్మరణం పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. సూర్యాపేట జిల్లా మోతే వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జావేద్ మరణించారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి పేర్కొన్నారు. ఖమ్మం రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జావేద్, పార్టీ కోసం నిరంతరం అంకితభావంతో పనిచేశారని మంత్రి కొనియాడారు. ప్రజా సమస్యలపై స్పందించే గుణం, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించే నేర్పు కలిగిన నాయకుడు జావేద్ అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ శ్రేణులకు తీరని లోటని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. జావేద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని మంత్రి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# ప్రజా నూతన రహదారులను అడ్డుకోవడం చట్ట విరుద్ధం శిక్షార్హమైన నేరం.----- ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య.

అక్షర కలం / ఇల్లెందు.



ప్రజా నూతన రహదారుల నిర్మాణాలను అడ్డుకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ప్రభుత్వాభివృద్ధి కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య హెచ్చరించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న రాయల్స్ టీ స్టాల్ పక్కనుండి సత్యనారాయణపురం 1వ వార్డు, 2వ వార్డు ఇల్లందులపాడు, సిఎస్ఐ చర్చ్, సత్యనారాయణపురం దర్గా, ఇల్లందులపాడు కాళీమాత ఆలయం మరియు క్రైస్తవ, హిందూ, ముస్లిం సమాధుల వైపు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండగా కొందరు ఆర్టీసీ స్థలం అంటూ అక్రమ నిర్మాణాలు చేపట్టి, ప్రజల ప్రయోజనార్థం జరుగుతున్న సీసీ రోడ్ పనులకు అడ్డంకులు సృష్టించడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు.ఈ కారణంగా మున్సిపల్ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోవడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని,ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య కఠినంగా హెచ్చరిస్తూ, ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన రహదారి విస్తరణ మరియు సీసీ రోడ్ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవడం సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే, సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా, తెలంగాణ హైకోర్టు పలు తీర్పుల్లో స్పష్టంగా పేర్కొన్నట్లు ప్రజా రహదారులపై ఎటువంటి అక్రమ ఆక్రమణలు అనుమతించబడవని,ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే నిర్మాణాలను తొలగించడం ప్రభుత్వ, స్థానిక సంస్థల చట్టబద్ధ బాధ్యత అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను అడ్డుకోవడం చట్ట విరుద్ధం మాత్రమే కాకుండా శిక్షార్హమైన నేరమని కూడా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డమిత్ర డానియల్, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, ఇల్లందు మునిసిపల్ 20 అవార్డు కౌన్సిలర్ మహమ్మద్ జాఫర్, ఆర్టిసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బానోత్ ఆనంద్ ను అభినందించిన సిఐ.నాగరాజు, ఎస్ఐ.స్వప్న,

అక్షర కలం / భద్రాచలం




భద్రాచలం పోలీస్ స్టేషన్ నందు తప్పిపోయిన వ్యక్తి గురించి పిర్యాదు ఇవ్వగా అట్టి పిర్యాదు మేరకు భద్రాచలంఎస్ఐ.జి.స్వప్న ,ఈనెలపన్నెండో తారీకు న కేసు నమోదు చేసి,తప్పిపోయిన వ్యక్తి యొక్క వివరములు మరియు అతని ఫోటో తో పాటుగా భద్రచాలం ప్రెస్ లో మరియు భద్రచాలం లోకల్ వాట్స్ అప్ గ్రూప్ లలో పంపి,తప్పిపోయిన వ్యక్తిగురించివిచారణచేస్తున్నక్రమంలో నిన్నటి రోజున పిచుకలపాడు ప్రాంతానికి చెందిన బనోత్.ఆనంద్, అను ఆటో డ్రైవర్ భద్రాచలంలోని రాజుపేటకాలనీలోఆటోనడుపు తుండగాఒకవ్యక్తిఅటువైపుగాన డుచుకుంటూ వెళుతుండగా ఆటో డ్రైవర్ భద్రచాలం లోకల్ వాట్స్ అప్ గ్రూప్ లలో వచ్చిన తప్పిపోయిన వ్యక్తి యొక్క ఫోటో ను చూసి,అట్టి ఫోటో లో ఉన్న వ్యక్తి అతనిగా గుర్తించి వెంటనే భద్రాచలం పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించి తప్పిపోయిన వ్యక్తిని తన యొక్క ఆటోలోతీసుకొని భద్రాచలం పోలీస్ స్టేషన్ తీసుకొని రాగా,సదరు ఆటో డ్రైవర్ చేసిన మంచి పనికి గాను భద్రాచలం ఇన్స్పెక్టర్ నాగరాజు,మరియు ఎస్ ఐ.జి.స్వప్న ,సదరు ఆటో డ్రైవర్ ను అబినందించి అతనికి కొంత నగదు పురస్కారం ఇవ్వడం జరిగింది. ఇతనిలాగే అందరు కూడా పోలీస్ వారికీ సహకరించాలని,పోలీస్ వారికీ సహకరించిన ప్రతి ఒక్కరికి తగిన పురస్కారం ఇవ్వడం జరుగుతుంది అని భద్రాచలం ఎస్ ఐ.జి.స్వప్న , తెలియజేశారు

# నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15:

వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్ – అలైవ్ లో



భాగంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో డిసిపి ఎ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, గుడిపేట పోలీస్ బెటాలియన్ అడ్మిన్ వెంకటరాములు, జిల్లా రవాణా అధికారి గోపికృష్ణ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రహదారి భద్రత




నిబంధనలను పాటించాలని, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ – అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాలను నడపాలని, రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్ల చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వాహనదారులు మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు పరిమిత లోడ్ రవాణా చేయాలని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యులై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలను కఠినంగా అమలు చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా బ్రీత్ ఎనలైజర్స్, స్పీడ్ గన్స్ అవసరం మేరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్న చిన్న విషయాలే మన ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి నియమాలు పాటిస్తూ వాహనదారులు బాధ్యతతో వాహనాలు నడిపితే రహదారి ప్రమాదాలను సమర్ధవంతంగా నివారించవచ్చు.... - కలెక్టర్ ప్రతిమాసింగ్.....

– ప్రజల ప్రాణాల భద్రతే పోలీస్ శాఖ లక్ష్యం.....

– ఐ.జి చంద్రశేఖర్ రెడ్డి......

మెదక్ / కొల్చారం ఏప్రిల్ 15(అక్షర కలం):-







మనోహరాబాద్ మండలంలోని కలకల్ లో జరిగిన అరయ్–ఆలైవ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐ జీ చంద్ర శేఖర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.డ్రైవర్స్ కు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించి, డ్రైవర్లకు పలు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ జీ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను ప్రజలు అలవాటు చేసుకోవాలనీ,తూప్రాన్ కాలకాల్



గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఘనంగా చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. స్కూల్ బస్సులు ఫిట్ నెస్ కలిగి ఉండేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని,వాహన చోదకులు హెల్మెట్ తప్పక తీసుకోవాలన్నారు. రోడ్డు పై ప్రయాణించేటపుడు ఎదుటి వారి అజగ్రత్తలను కూడా గమనించి ప్రయాణించాలన్నారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలను నివారించాలనీ,ప్రతి సం; దాదాపు 7000 ప్రమాదాలు జరుగుతున్నాయని, జాగ్రత్త లే ప్రమాదాల నివారణకు మార్గమన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి, డీఎస్పీలు, స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సామాజిక బాధ్యతగా గుర్తించాలి: అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

రోడ్డు భద్రత సామాజిక బాధ్యతగా గుర్తించాలని అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు అరైవ్ ఆలైవ్ అవగాహన కార్యక్రమం నగరంలోని ాా= జూనియర్ కాలేజ్ నిర్వహించారు. ఈ సందర్బంగా అడిషనల్ డీజీ మాట్లాడుతూ...రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతని, ఇది ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ద్విచక్ర వాహనాలపై హెల్మెట్, కార్లలో సీట్ బెల్ట్ ధరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకపోవడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, అతివేగాన్ని నియంత్రించడం వంటి నిబంధనలు పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందన్నారు.యుద్ధాలలో, నేరాలల్లో మరణించే వారి కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది చనిపోతున్నారనేది వాస్తవమని, ప్రతి సంవత్సరం సుమారు 1.8 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా, ప్రతి నిమిషానికి ఒక ప్రమాదం జరుగుతోందని, ప్రతి మూడు నిముషాలకు ఒకరు చనిపోతున్నారని పేర్కొన్నారు. మృతులలో అత్యధికులు 18–45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఎక్కువ వున్నారని తెలిపారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల ఈ మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు.విదేశాల్లో కఠినమైన చట్టాలు, భారీ జరిమానాలు ఉండటంతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తారని, కానీ ఇండియాలోకి రాగానే అవే నిబంధనలను నిర్లక్ష్యం చేస్తారని, ఈ అలసత్వం వల్ల ఏటా భారీగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా పిల్లలకు రోల్ మోడల్ (ఆదర్శం)గా నిలవాలని, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం వంటివి నిత్యజీవితంలో పాటిస్తూ, పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో, తల్లిదండ్రులు ఇంట్లో భద్రతా అలవాట్లను ప్రోత్సహించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. అవగాహన కార్యక్రమంలో నేర్చుకున్న



ప్రతి అంశాన్ని కుటుంబ సభ్యులకు, బంధువులకు అవగాహన కల్పించాలన్నారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ..చిన్న నిర్లక్ష్యపు చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.రోడ్డు ప్రమాదం వల్ల కుటుంబంలోని వ్యక్తిని కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని, ఇది తీవ్రమైన దుఃఖం, మానసిక వేదన, నిత్యజీవితంలో పెను మార్పులను కలిగిస్తుందని, మానసిక ఒత్తిడి, ఆర్థిక కష్టాలు ఎదురవుతాయని గుర్తించాలన్నారు. బయటకు వెళ్లిన వ్యక్తులు క్షేమంగా ఇంటికి చేరుకోవడం కోసం హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని కుటుంబ సభ్యులు చెప్పాలన్నారు.విద్యార్థులు రోడ్డు భద్రతా నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తామని, హెల్మెట్/సీటు బెల్ట్ ధరిస్తామని, మద్యం తాగి వాహనం నడపమని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా ఒఆర్డర్ ప్రసాద్ రావు, ఆర్టివో రాజశేఖర్, ఏసీపీలు రమణమూర్తి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సిఐలు భానుప్రకాష్, కరుణాకర్,బాలకృష్ణ, మోహన్ బాబు,రాజిరెడ్డి, సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నార.

# మరికల్ శ్రీవాణి హై స్కూల్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం: రోడ్ సేఫ్టీ, చైల్డ్ రైట్స్ అవగాహన ;




(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,15)

నారాయణపేట జిల్లా మరికల్‌లోని శ్రీవాణి హై స్కూల్‌లో మరికల్ శాఖ పోలీస్ ఆధ్వర్యంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమం రోడ్ భద్రత నియమాలు, చైల్డ్ సేఫ్టీ, స్కూల్ బస్సు డ్రైవింగ్ జాగ్రత్తలపై దృష్టి సారించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, డ్రైవర్లకు ఈ అవగాహన కార్యక్రమం భవిష్యత్ ప్రమాదాలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. సందర్భంగా మాట్లాడిన మరికల్ ఎస్సై మహేశ్వర్, రోడ్ భద్రత విషయాల్లో విద్యార్థులు పాటించాల్సిన నియమాలు -- హెల్మెట్ ధరించడం, జెబ్రా క్రాసింగ్ వాడటం, వాహనాలకు దూరంగా ఉండటం వంటివి వివరించారు. అదే విధంగా ఫోక్స్ యాక్ట్ (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్షువల్ ఆఫెన్సెస్) గురించి, గుడ్ టచ్ (స్నేహపూర్వకంగా అనుభవించే స్పర్శ) మరియు బ్యాడ్ టచ్ (ఇబ్బంది కలిగించే స్పర్శ) మధ్య తేడా తెలియజేశారు. "ఏదైనా సమస్య ఉంటే తల్లిదండ్రులు లేదా పోలీసులకు వెంటనే చెప్పాలి" అని విద్యార్థులకు సలహా ఇచ్చారు. స్కూల్ బస్సు డ్రైవర్లకు ప్రత్యేక సెషన్‌లో ఓవర్ స్పీడ్ నివారణ, మహిళలు-పిల్లల సురక్షిత రవాణా, వాహన పరిశీలనలు, ఎమర్జెన్సీలో చేయాల్సిన చర్యలు చెప్పారు. ఈ జాగ్రత్తలు పాటిస్తే స్కూల్ కిడ్స్‌కు రోడ్డు ప్రమాదాలు 50% తగ్గుతాయని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ శ్రీమతి పూర్ణిమ వెంకటేశ్వర్లు పాల్గొని, పోలీస్ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. కానిస్టేబుల్స్ దినేష్, శ్రీధర్, స్కూల్ డ్రైవర్లు, పూర్తి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అందరూ చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో చైల్డ్ సేఫ్టీ అవగాహనను పెంచడంలో మైలురాయిగా మారింది.

# పెద్ద చింతకుంట గ్రామంలో విషాదం: కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి 5,000 సహాయం ;



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్,15)

మరికల్ మండలం పెద్ద చింతకుంట గ్రామవాసి కొండ వెంకటన్న ఆకస్మికంగా పరమపదించారు. ఈ విషాద సమాచారం తెలిసిన వెంటనే కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా నాయకుడు ఎస్. సూర్య మోహన్ రెడ్డి, బాధిత కుటుంబ నివాసానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, పరామర్శించారు.మృతదేహానికి పూలమాలలు వేసి గొప్ప శ్రద్ధాంజలి చేర్చిన , ఈ దుఃఖకర సమయంలో కుటుంబానికి ?5,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, గ్రామస్తులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, వెంకటన్న ఆత్మకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్. సూర్య మోహన్ రెడ్డి, "ఇలాంటి దుఃఖాల్లో పార్టీ ఎల్లప్పుడూ బాధితుల పక్షంలో నిలబడుతుంది. కుటుంబానికి మా సానుభూతి, సహాయం అందిస్తామి" అని తెలిపారు. గ్రామవాసులు కూడా ఈ సహాయానికి ధన్యవాదాలు చెప్పుకున్నారు.

# వాలంటీర్స్ ద్వారా రోడ్డు ప్రమాదాలకు చెక్: ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్ ;

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్ 15)

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు "అరీవ్ అలీవ్" కార్యక్రమంలో భాగంగా ధన్వాడ టౌన్‌లో బుధవారం రోజు ఎస్సై వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై మానవహారం చేపట్టి ప్రజల్లో చైతన్యం కల్పించారు.అనంతరం పాఠశాలలు, కళాశాలల్లో ఐదు మంది ఉపాధ్యాయులు, విద్యార్థులతో వాలంటీర్స్ బృందాలు ఏర్పాటు చేశారు. ఈ వాలంటీర్స్ ద్వారా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించి, వాటి వివరాలు సేకరించి సంబంధిత అధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై తెలిపారు.స్కూల్ బస్సుల తనిఖీలు చేపట్టి, విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించకూడదని, బస్సులను మంచి కండిషన్‌లో ఉంచాలని, మద్యం తాగి నడపకూడదని సూచించారు.ఎస్సై మాటలుఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని, వాలంటీర్స్ వ్యవస్థ ద్వారా సమస్యలను త్వరగా గుర్తించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఇతరులకు కూడా చైతన్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో రోడ్డు భద్రతపై మానవహారం- మరికల్ సీఐ భగవంత్ రెడ్డి

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,15)

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు, మరికల్ పట్టణంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మరికల్ సీఐ భగవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ






కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై మానవహారం ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా మరికల్ సీఐ భగవంత్ రెడ్డి, ఎస్సై-2 మహేశ్వరి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల అవగాహన ఎంతో కీలకమని, ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు ముందుకు వచ్చి సమాజంలో మార్పు తీసుకురావాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వాడడం, మితిమీరిన వేగం నివారించడం, మద్యం తాగి వాహనం నడపకూడదని స్పష్టం చేశారు.విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, పరిసరాలవారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. "రక్తపు చారలు లేని రోడ్లే మన లక్ష్యం -- రోడ్డు భద్రత మనందరి బాధ్యత" అని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్లతో గ్రామాల్లో కళ

## కాంగ్రెస్ అంటేనే ఇందిరమ్మ ఇండ్లకు బ్రాండ్

## ఇందిరమ్మ ఇండ్లతో

## ప్రభుత్వం సక్సెస్

## నియోజకవర్గ ఇంచార్జ్

## పూజల హరికృష్ణ

## నేడు నారాయణరావుపేట మండలంలోని, జక్కాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి విచ్చేసిన

## సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ వారికి సాదర ఆహ్వానం పలికిన డిసిసి ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్



## అలాగే స్థానిక కాంగ్రెస్ నాయకులు

అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 15:

జక్కాపూర్ గ్రామంలో పార్నంది స్వాతి - సీతారామ ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ ఆహ్వానం మేరకు వారి ఇంటికి వచ్చి, పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారి ఇండ్లలో అతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.కుల మతాలకు అతీతంగా ఇళ్ళు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ళను ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్లను అర్హులందరికీ ఇచ్చే బాధ్యత మాది అని ఆనాడు అంటే.. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు నమ్మలేదు, కానీ ప్రజలు విశ్వసించరు, కాంగ్రెస్ పార్టీని దివించారు. ఈ ప్రజా దీవేనలతోనే మళ్ళీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్నారు. నేడు రాష్ట్రంలో ఒక పక్క సంక్షేమం,మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. ప్రాంతాలతో, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన అందరికి సమన్యాయం చేసే విదంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తుంది అన్నారు. కొద్దీ రోజుల్లోనే ఇంకా మిగిలిపోయిన అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించి, ప్రతి పేదవాడి ఇంటికి స్వయంగా వచ్చి వారి ఆనందంలో తాను కూడా పాల్గొంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎండీ కలిమోద్దీన్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ,మండల అధ్యక్షుడు బర్మ రామచంద్రము, డిసిసి ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్,బుగ్గ రాజేశ్వర గుడి చైర్మన్ బాగన్నగారి కరుణాకర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్, ఎఎంసి డైరెక్టర్ అశోక్ గౌడ్, మండల మైనారిటీ అధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాట్ల రాజు,బిట్ల శ్రీనివాస్,చెంది శ్రీనివాస్, ఉప సర్పంచ్ పర్శరాములు, కూరటి రాజయ్య, మిట్టపల్లి కవిత, కూరటి చంద్రం,జిల్లా శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అంబటి విట్టల్,అరవింద్, రాకేష్ యాదవ్, గ్రామ ప్రజల పాల్గొన్నారు.

# నర్మేట వాసికి దళిత రత్న అవార్డు

## నలుమాల నవిన్ కు "దళిత రత్న" అవార్డు

అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 15:



హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన మహనీయుల జయంతి సందర్భంగా సామాజిక న్యాయం కోసం పోరాడిన ప్రముఖులకు "దళిత రత్న" అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నంగునూరు మండలం నర్మేట గ్రామానికి చెందిన జాతీయ మాల మహానాడు యూత్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు నలుమాల నవిన్ కు ఈ ప్రతిష్టాత్మక "దళిత రత్న" అవార్డు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా నలుమాల నవిన్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డా, అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, జిల్లా నాయకులు ఆరే కిషోర్ ల నాయకత్వంలో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సమాజ సేవలో ముందుండి పనిచేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ అల్లిబిల్లి మహేందర్ కు, సాంఘిక సంక్షేమ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చిన్నకోడూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్

అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 15:

సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలం పెద్ద కోడూరు గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజశేఖర్ మాట్లాడుతూ రైతు బాగుంటే దేశం బాగుంటుంది.రైతు సంతోషంగా ఉంటే సమాజం సుభిక్షంగా ఉంటుంది అని అన్నారు. రైతును రాజును చెయ్యడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు.రైతులు ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న మా పాలక మండలి దృష్టికి తీసుకవస్తే మార్కెట్ కమిటీ చైర్మన్ నేతృత్వంలో మేము నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ,ఇంచార్జి మంత్రి వర్యులు వివేక్ వెంకట స్వామి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తేమ శాతం మరియు నాణ్యత ప్రమాణాలు పాటించాలని రైతులకు సూచించారు. తూకం, చెల్లింపులు లేదా ఇతర అంశాలలో ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే మార్కెట్ కమిటీని సంప్రదించాలని తెలిపారు. రైతుల కష్టం వృథా కాకుండా ప్రతి గింజకు గౌరవం దక్కేలా మార్కెట్ కమిటీ కట్టుబడి ఉందని బుస్స రాజశేఖర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజవర్ధన్,విజయ్ కుమార్,వినోద్,సలీం,అశోక్,సోని,లక్ష్మి కాంగ్రెస్ నాయకులు శ్యామల సంతు,పెద్దకోడూరు గ్రామ సర్పంచ్ సామలసునీత-మధు,ఉపసర్పంచ్ వర్కోలు నవీన-రంగరాజంవార్డు మెంబర్లుఆలేటి శ్రీనివాస్, తుమ్మల తిరుపతి,ముత్తి మహేష్ గౌడ్,నాయిని రవి,కరెమల్లు కవిత దర్శనం అనిత రైతులు బర్మా శ్రీశైలం, ఎట్లా దేవయ్య, బట్టు రాజు, బర్మా శ్రీకాంత్, సుధాకర్, ఎల్లయ్య, శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955